ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -89 పేజీలు - 8 వెల - 03/- శనివారం18 జులై 2026

# రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి




- రుణ వితరణ కార్యక్రమంతో వ్యాపారవేత్తలుగా సామాన్యులు
- సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి నిర్మాలాసీతారామన్ సహకారం
- కూటమి వచ్చాక రుణాల రీ- షెడ్యూల్‌తో రూ.1538 కోట్లు ఆదా
- నరసరావుపేట రుణ వితరణ మేళాలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- వివిధ వర్గాలకు రూ.3,216 కోట్లు పంపిణీ చేసిన సీఎం, కేంద్ర మంత్రి

**నరసరావుపేట, జూలై 17 (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించటం గర్వకారణమని, బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువత కలలు నెరవేర్చడానికి, పారిశ్రామికవేత్తల లక్ష్యం నెరవేరడానికి రుణాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. గత వైసీపీ పాలనంతా సమస్యల సుడిగుండమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రానికి తిప్పలు తెచ్చిందని, కూటమి అధికారంలోకి వచ్చాకే ఆ రుణాల్ని కేంద్ర సహకారంతో రీ -షెడ్యూలుమిగతా 2లో...







# సరికొత్త శకం

## తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

- హర్యానాలో జింద్-సోనిపట్ మధ్య పరుగులు పెట్టనున్న హైడ్రోజన్ రైలు
- హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం
- ఢిల్లీ-కత్రా మధ్య ప్రయాణ సమయాన్ని 14 నుంచి 6 గంటలకు తగ్గించనున్న కొత్త ఎక్స్‌ప్రెస్‌వే
- కురుక్షేత్రలో ఎలివేటెడ్ రైల్వే ట్రాక్, కొత్త మెడికల్ కాలేజీలను జాతికి అంకితం

**జూలై 17 (రిపబ్లిక్ న్యూస్):**
స్వచ్ఛ ఇంధన రవాణా రంగంలో భారతీయ రైల్వే చారిత్రక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు, తన ప్రయాణానికి అవసరమైన విద్యుత్‌ను హైడ్రోజన్‌ను ఉపయోగించి స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది 2లో...




# సుదీర్ఘ నిరీక్షణకు తెర..

## ఏపీకి వక్ఫ్ రికార్డులు అప్పగించిన తెలంగాణ

- పన్నెండేళ్ల తర్వాత తెలంగాణ నుంచి ఏపీకి చేరిన వక్ఫ్ రికార్డులు
- సుమారు 3,503 ఫైళ్లు, 4,050 సర్వే రిపోర్టులు స్వాధీనం
- ఇది చారిత్రక విజయమని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ వెల్లడి
- తెలంగాణ నుంచి రూ. 55 కోట్లు కూడా రావాల్సి ఉందని వెల్లడి




**జూలై 17 (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్ర విభజన జరిగి పన్నెండేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న ఒక కీలక వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన వేలాది వక్ఫ్ ఆస్తుల రికార్డులను తెలంగాణ వక్ఫ్ బోర్డు ఏపీకి అప్పగించింది. ఈ బదలాయింపుతో గత పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.మిగతా 2లో...

# సమస్యలపై పార్లమెంటులో ప్రస్తావించండి

## నిధులను రాబట్టేందుకు యత్నించండి

## పార్టీ ఎంపిలకు చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి,జూలై 17 (రిపబ్లిక్ న్యూస్):**
తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఆ పార్టీ పార్లమెంటరీ భేటీ జరిగింది. ఈనెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలతో సీఎం చర్చించారు. వివిధ అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టు పురోగతి, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, నిర్వాసితుల పునరావాస కార్యక్రమాలు, రాజధాని నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణపై చంద్రబాబు సూచనలు చేశారు.మిగతా 2లో...




# ధరణి అక్రమాలపై సిట్

- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం
- ఇక పంచాయితీల నిధులను నేరుగా బ్యాంకులో జమ
- ట్రెజరీలో జమచేసే నిబంధన ఎత్తివేసిన కేబినేట్
- జగిత్యాల జిల్లా డిగ్రీకాలేజీలో పోస్టు భర్తీకి ఆమోదం
- పటాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్లకు భూ కేటాయింపు
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు ఆమోదం
- దేవాదుల, చిన్న కాళేశ్వరం,
- పాలమూరు- సీతారామల అంచనా వ్యయాల పెంపు

**హైదరాబాద్,జూలై 17 (రిపబ్లిక్ న్యూస్):**
తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగామిగతా 2లో...






# పెరుగుతున్న కరోనా..

- అలర్ట్ అయిన ఏపీ ప్రభుత్వం
- దేశ వ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసులు
- ఏపీలో ఇప్పటి వరకు 13కి పైగా కేసుల నమోదు
- ఇప్పటికే నలుగురు కోవిడ్ పేషెంట్ల మృతి


Damodar Raja Narasimha

## ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం

# సరికొత్త హెల్త్ స్కీమ్

- ఉద్యోగులు, పెన్షనర్లు సహా 17.88 లక్షల మందికి లబ్ధి
- డిజిటల్ హెల్త్ కార్డుల ద్వారా సేవలు..
- NEHS వెబ్ పోర్టల్ ఆవిష్కరణ
- ఉద్యోగుల వాటాకు సమానంగా ప్రభుత్వ వాటా..
- ప్రత్యేక ట్రస్ట్ ద్వారా నిధుల నిర్వహణ

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు చిరకాలంగా నిరీక్షిస్తున్న 'న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్' (ఎన్‌ఈహెచ్‌ఎస్) శుక్రవారం లాంఛనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మిగతా 2లో...

## బలాబలాలను బట్టే

# స్థానిక ఎన్నికల్లో పోటీ

- స్థానిక ఎన్నికలపై నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు!
- స్థానిక ఎన్నికల్లో పాత ఫార్ములా వర్తించదన్న నాదెండ్ల మనోహర్
- పార్టీ బలాబలాలను బట్టే స్థానిక ఎన్నికల్లో పోటీ ఉంటుందని స్పష్టీకరణ
- సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసమే వెనక్కి తగ్గామన్న వ్యాఖ్య
- జనసైనికుల సమస్యల పరిష్కారానికి 'చర్చావేదిక' ప్రారంభం

**అమరావతి, జూలై 17 (రిపబ్లిక్ న్యూస్):**
ఏపీలో సార్వత్రిక ఎన్నికల వేడి చల్లారకముందే స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు స్థానిక ఎన్నికలపై పలు సందర్భాల్లో సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో, సెప్టెంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న ప్రచారంతో ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో మిగతా 2లో...



# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలి

రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్

**అమరావతి, జూలై 17 (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నత అధికారులతో ఆయన సమావేశమై వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక, మత్స్యశాఖలపై ఎల్‌నినో ప్రభావం, ఆయా శాఖలు చేపట్టాల్సిన మిగతా 2లో...



# సరికొత్త శకం

**మొదటిపేజీ తరువాయి**

కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తుంది.

ఈ 10 కోచ్‌ల రైలు హర్యానాలోని జింద్, సోనిపట్ మధ్య 90 కిలోమీటర్ల దూరాన్ని కేవలం రెండు గంటల్లో పూర్తి చేస్తుంది. 3,200 హార్స్‌పవర్ సామర్థ్యంతో పనిచేసే ఈ రైలు, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా నిలిచింది. ఈ ఘనతతో హైడ్రోజన్ రైళ్లను నడుపుతున్న అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది.

**రూ.12,470 కోట్లతో రహదారుల అభివృద్ధి**

ఈ కార్యక్రమంతో పాటు హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేసి, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా సుమారు రూ.9,680 కోట్ల వ్యయంతో నిర్మించిన 158 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-అమృత్‌సర్-కత్రా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ వల్ల ఢిల్లీ-కత్రా ప్రయాణ సమయం 14 గంటల నుంచి 6 గంటలకు, ఢిల్లీ-అమృత్‌సర్ ప్రయాణ సమయం 8 నుంచి 4 గంటలకు తగ్గనుంది. ఇది వైష్ణోదేవి యాత్రికులకు, పర్యాటకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

అదేవిధంగా అంబాలా-కాలా అంబ్, జింద్-గోహానా జాతీయ రహదారులను కూడా జాతికి అంకితం చేశారు. జింద్-గోహానా రహదారి వల్ల ప్రయాణ సమయం రెండు గంటల నుంచి 40 నిమిషాలకు తగ్గనుంది. హన్సీ-బరవాలా రహదారి విస్తరణ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.

**వైద్యం, మౌలిక సదుపాయాలకు పెద్దపీట**

కురుక్షేత్ర నగరంలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిర్మించిన ఎలివేటెడ్ రైల్వే ట్రాక్‌ను కూడా ప్రధాని ప్రారంభించారు. ఇది రైలు, రోడ్డు రవాణా వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచుతుంది.రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా భివానీలోని పండిట్ నేకీ రామ్ శర్మ ప్రభుత్వ వైద్య కళాశాల, నార్నౌల్‌లోని మహర్షి చ్యవన్ మెడికల్ కాలేజీ, రావు తులారామ్ ఆసుపత్రిని జాతికి అంకితం చేశారు. ఈ సంస్థల ద్వారా హర్యానాలో వైద్య విద్య, ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి.వీటితో పాటు సిక్కు గురువుల చరిత్ర, వారి త్యాగాలు, దేశ సంస్కృతికి వారు అందించిన సేవలను ఆధునిక టెక్నాలజీతో ప్రదర్శించేందుకు కురుక్షేత్రలో నిర్మించనున్న సిక్కు మ్యూజియానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులన్నీ హర్యానా సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తాయని ప్రభుత్వం పేర్కొంది.

# పెరుగుతున్న కరోనా..

## అలర్ట్ అయిన ఏపీ ప్రభుత్వం

**అమరావతి, జూలై 17 (రిపబ్లిక్ న్యూస్):**

దేశంలో మరోసారి కరోనా కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. దేశ వ్యాప్తంగా జులై 1 నుంచి 340కి పైగా కేసులు నమోదయ్యాయి. ఏపీలో కూడా కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. గడిచిన 20 రోజుల్లోనే రాష్ట్రంలో 13కి పైగా కేసులు నమోదయ్యాయి. కడప జిల్లాలో అత్యధికంగా 8 కేసులు నమోదు కాగా, గుంటూరులో 3, విశాఖలో 1, కాకినాడలో 1 కేసు నమోదైంది. మహమ్మారి కారణంగా ఇప్పటికే రాష్ట్రంలో నలుగురు మృతి చెందారు. హోం ఐసోలేషన్‌లో మరో ముగ్గురు ఉన్నారు.

ఆసుపత్రిలో ఇద్దరు కోవిడ్ పేషెంట్లకు చికిత్స అందుతోంది. కృష్ణా జిల్లాకు చెందిన మరో మహిళ కరోనా బారిన పడగా ఆమెకు ఎయిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం కరోనా బారినపడిన పేషెంట్ల శాంపిల్స్‌ను పూణేలోని ల్యాబ్‌కు పంపించారు. కేసులు ఎక్కువగా వస్తుండటంతో ప్రభుత్వం అలర్ట్ అయింది. అధికారులను అప్రమత్తం చేసింది. ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, టెస్టులు అందుబాటులో ఉంచాలని సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు. కరోనా కేసులపై నేడు మధ్యాహ్నం తర్వాత ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించే అవకాశం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించాలని, గుంపులు కట్టకుండా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కరోనా నివారణ చర్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

# సుదీర్ఘ నిరీక్షణకు తెర..

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ వక్ఫ్ బోర్డు నుంచి మొత్తం 3,503 ఫైళ్లు, 4,050 సర్వే కమిషనర్ నివేదికలు, రెండు అధికారిక గెజిట్ వాల్యూమ్‌లతో పాటు ఇతర కీలక పత్రాలను ఏపీ వక్ఫ్ బోర్డు అధికారులు స్వీకరించారు. ఇదొక చారిత్రక మైలురాయి అని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు అవసరమైన కీలక ఆధారాలు ఇప్పుడు తమ వద్ద ఉన్నాయని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

2014లో రాష్ట్ర విభజన సమయంలో వక్ఫ్ చట్టం-1995 నిబంధనల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన రికార్డులు, ఆస్తులు, నిధులు బదిలీ కావాల్సి ఉన్నప్పటికీ, ఆ ప్రక్రియ దశాబ్ద కాలానికి పైగా స్తంభించిపోయింది. కీలక రికార్డులు అందుబాటులో లేకపోవడంతో ఆస్తుల యాజమాన్య హక్కులను నిర్ధారించడం, ఆక్రమణలను నిరోధించడం, న్యాయస్థానాల్లో కేసులను సమర్థవంతంగా వాదించడం ఏపీ వక్ఫ్ బోర్డుకు పెను సవాలుగా మారింది.ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, ఎన్.ఎం.డి. ఫరూక్ అందించిన సహకారంతో పాటు, తాము జరిపిన ఉన్నత స్థాయి చర్చలు ఫలించాయని అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. ఈ రికార్డుల లభ్యతతో వక్ఫ్ ఆస్తుల నిర్వహణను క్రమబద్ధీకరించడం, వివాదాలను వేగంగా పరిష్కరించడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. ఇదే క్రమంలో తెలంగాణ వక్ఫ్ బోర్డు నుంచి ఏపీకి సుమారు రూ. 55 కోట్ల నిధులు రావాల్సి ఉందని, అవి కూడా త్వరలోనే విడుదలవుతాయని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హెల్త్ స్కీమ్

**మొదటిపేజీ తరువాయి**

మంత్రి దామోదర రాజనర్సింహ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ అధికారిక పత్రాలతో పాటు, చీజునూ వెబ్ పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులను వారు ఆవిష్కరించారు.ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4.39 లక్షల మంది ఉద్యోగులు, 3.62 లక్షల మంది పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం 17.88 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. వీరికి 114 ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు అపోలో, యశోద, కిమ్స్, కేర్, స్టార్ వంటి 886 ప్రముఖ కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో నగదురహిత (క్యాష్‌లెస్) వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) ధరలకు అనుగుణంగా 1,816 రకాల మెడికల్, సర్జికల్ ప్యాకేజీలను ఈ పథకంలో పొందుపరిచారు.పథకం నిర్వహణ కోసం ఉద్యోగులు, పెన్షనర్లు తమ ప్రాథమిక వేతనం లేదా పెన్షన్‌లో 1.5 శాతం వాటాను విరాళంగా అందజేస్తారు. అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా తన వంతుగా జమ చేస్తుంది. నిధుల నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటిస్తూ ప్రభుత్వ, ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులతో కూడిన ఒక ప్రత్యేక ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు చీజునూ పోర్టల్ ద్వారా తమ డిజిటల్ హెల్త్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.గత ఆరోగ్య పథకంలోని లోపాలను అధిగమిస్తూ, ఉద్యోగ సంఘాల నుంచి అందిన సూచనల మేరకు ఈ సరికొత్త పథకాన్ని అత్యంత పకడ్బందీగా రూపొందించినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జూలై మధ్య నాటికి ఈ నగదు రహిత సేవలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని అధికారులు వెల్లడించారు. ఈ పథకం ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం నుంచి భారీ ఊరటనిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

# సమస్యలపై పార్లమెంటులో ప్రస్తావించండి

**మొదటిపేజీ తరువాయి**

రాయలసీమకు సాగునీటిని అందించేందుకు చేపట్టాల్సిన గోదావరి-పెన్నా అనుసంధాన ప్రక్రియ, కార్యాచరణపై సీఎం దిశానిర్దేశం చేశారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాలు, రైల్వే భూముల కేటాయింపు, జోన్ పూర్తిస్థాయి కార్యకలాపాల ప్రారంభం అంశాలపై చర్చించారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెట్టే వివిధ చట్ట సవరణలు, కొత్త బిల్లుల పట్ల పార్టీ అనుసరించాల్సిన విధానంపై సమావేశంలో చర్చ జరిగింది. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లు, ఎస్ఐఆర్ అంశాలపై నేతలతో సీఎం చర్చించారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న దుష్ప్రచారం, ఫేక్ న్యూస్ కట్టడి, వ్యవస్థలపై జరుగుతున్న దాడుల అంశాల్లో పార్లమెంట్ వేదికగా లేవనెత్తే విషయంపై చంద్రబాబు పలు సూచనలు చేశారు. ఎంపీలు తమ నియోజకవర్గాల సమస్యలు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై చర్చించారు.

# బలాబలాలను బట్టే స్థానిక ఎన్నికల్లో పోటీ

**మొదటిపేజీ తరువాయి**

వ్యూహరచనకు పదును పెడుతున్నాయి. ఈ క్రమంలో అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలోనూ స్థానిక ఎన్నికల పొత్తులు, సీట్ల పంపకాలపై చర్చ ఊపందుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించిన ఫార్ములా స్థానిక ఎన్నికలకు వర్తించదని, పార్టీ బలాబలాల ఆధారంగానే పోటీ ఉంటుందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే 2024 సార్వత్రిక ఎన్నికల్లో తమ అధినేత పవన్ కల్యాణ్ పొత్తు నిర్ణయం తీసుకున్నారని మనోహర్ గుర్తుచేశారు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా, వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే లక్ష్యంతో జనసేన కొన్ని సీట్లలో సర్దుకుపోయిందని, నాలుగు అడుగులు వెనక్కి తగ్గిందని అన్నారు. అయితే, ఆ త్యాగాన్ని స్థానిక ఎన్నికల్లోనూ ఆశిస్తే పొరపాటేనని ఆయన స్పష్టం చేశారు.

"సార్వత్రిక ఎన్నికల ఫార్ములానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఉంటుందనడం సరికాదు. స్థానిక పరిస్థితులు, పార్టీ బలం ఆధారంగానే మా పోటీ ఉంటుంది. పొత్తు ధర్మాన్ని పాటిస్తూనే, జనసేన బలంగా ఉన్నచోట కచ్చితంగా పోటీ చేస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. త్వరలో జరగబోయే ఎన్డీయే కూటమి సమావేశంలో ఈ విషయంపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.పార్టీ బలోపేతం, కార్యకర్తలకు అవకాశాలు కల్పించడంపై కూడా జనసేన దృష్టి సారించింది. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారికి స్థానిక ఎన్నికల్లో తప్పకుండా అవకాశం కల్పిస్తామని మనోహర్ భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే జనసైనికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేసేందుకు 'జనసేన పార్టీ చర్చావేదిక' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిని రాష్ట్రంలో తొలిసారిగా కైకలూరు నుంచి మొదలుపెట్టినట్లు ఆయన ప్రకటించారు. ఈ వేదిక ద్వారా గ్రామస్థాయిలో కార్యకర్తల ఇబ్బందులను తెలుసుకోవడంతో పాటు వైసీపీ సోషల్ మీడియా ద్వారా చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొడతామని వివరించారు.

కూటమిగా కలిసి పనిచేస్తున్నప్పుడు చిన్న చిన్న సమస్యలు, అభిప్రాయభేదాలు సహజమని, వాటిని సర్దుకుని ముందుకు సాగాలని జనసైనికులకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ విధ్వంసం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమిలోని అన్ని పార్టీల శ్రేణులు అంకితభావంతో కలిసికట్టుగా పనిచేసి, ప్రభుత్వానికి అండగా నిలవాలని మనోహర్ సూచించారు. మొత్తం మీద స్థానిక ఎన్నికల్లో జనసేన మరింత కీలక పాత్ర పోషించాలని భావిస్తోందని, సీట్ల పంపకాల్లో గట్టిగా బేరమాడేందుకు సిద్ధమవుతోందని మనోహర్ వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది.

# రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి

**మొదటిపేజీ తరువాయి**

చేసి రూ.1,538 కోట్లు ఆదా చేశామని అన్నారు. పలనాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణమేళా కార్యక్రమానికి (క్రెడిట్ అవుట్ రీచ్) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలనాడు జిల్లాలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలను అందజేశారు. ఇందులో భాగంగా 15 వేల మంది డ్వాక్రా మహిళలకు,13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. పలనాడు పౌరుషానికి శక్తివంతమైన ఆయుధం ఇస్తున్నాం. క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు ఇలా అర్హులైన వారందరికీ రుణం అందించటమే లక్ష్యం. మహిళా సాధికారతకు ఈ క్రెడిట్ అవుట్ రీచ్ ద్వారా ప్రయోజనాలు చేకూరతాయి. రెండేళ్ల క్రితం రాష్ట్రం అంతా సమస్యల సుడిగుండంలో ఉంది. ఏపీలో ఆర్థిక విధ్వంసం చేశారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఆకాంక్షలు నెరవేరాయి. వీబీజీ రామ్ జీ కింద కేంద్రం నుంచి రూ.7,707 కోట్లు రాష్ట్రానికి వస్తుంది. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్లు ఆర్థిక సహకారం అందిస్తుంది.ప్రైవేటు పెట్టుబడులతో కలిపి ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తాం." అని సీఎం వివరించారు.



"మహిళలందరికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదర్శంగా నిలుస్తున్నారు. 10 లక్షల డ్వాక్రా సంఘాలు రూ.29 వేల కోట్ల పొదుపుతో దేశంలోనే మేటిగా నిలిచాయి. రుణాల రీ పేమెంట్ లో 99.5 శాతంతో డ్వాక్రా మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. వారందరినీ మహిళా వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. బ్యాంకింగ్ లో నిర్మలా సీతా రామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం, జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది బ్యాంకు ఖాతాలు, జీఎస్టీ శ్లాబ్ లను కుదించి పారదర్శక విధానం తెచ్చారు. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు కేంద్ర మంత్రి నిర్మల తీసుకొచ్చారు. ఈ తరహా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాల్ని 6 జిల్లాల్లో నిర్వహించేందుకు తక్షణమే అంగీకరించారు. త్వరలోనే 3 నెలలకు ఒకటి చొప్పున ఈ తరహా కార్యక్రమాలు చేపడతాం." అని ముఖ్యమంత్రి అన్నారుదేశంలోని ప్రతి గ్రామంలోనూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాను ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి బ్యాంకులు ఎన్‌పీఏల సమస్యలతో ఇబ్బందుల్లో ఉండేవని, చిన్న వ్యాపారులు అప్పులు దొరక్క నష్టపోయేవారని గుర్తుచేశారు. చిన్న వ్యాపారుల ఆర్థిక కష్టాలను గుర్తించిన ప్రధాని మోదీ.. ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి బ్యాంకుల ద్వారా వారికి సులభంగా రుణాలు అందేలా పథకాలు తెచ్చారని వివరించారు. నేడు బ్యాంకులు స్వయంగా వ్యాపారుల చెంతకే వచ్చి రుణాలు ఇస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మెగా రుణమేళాలో భాగంగా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి రుణ మంజూరు పత్రాలను, చెక్కులను అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేతయూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.42.16 లక్షల విలువైన అంబులెన్స్‌ను పిడుగురాళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. అలాగే నాబార్డు సౌజన్యంతో డీసీసీబీ (ఆఅఅః) కి రూ.25 లక్షల విలువైన 2 మొబైల్ డెమో వ్యాన్లు అందించారు. అలాగే విద్యార్థినులకు రూ.17.80 లక్షల విలువైన 301 సైకిళ్లను పంపిణీ చేశారు. పర్యాటక శాఖకు గ్రామీణ బ్యాంక్ తరపున రూ.14 లక్షల విలువైన 2 బ్యాటరీ వాహనాలను అందించారు. వీటిని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం రామకృష్ణ, పలువురు ఎమ్మెల్యేలు, బ్యాంక్ అధికారులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. సభకు ముందు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాళ్లను సందర్శించి, నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలి

**మొదటిపేజీ తరువాయి**

ముందస్తు చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను క్షేత్రస్థాయిలో పటిష్ఠంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి జిల్లా కలెక్టర్ పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ, అధిక ప్రమాద మండలాలు, రైతు సేవా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.రాష్ట్రంలో జూన్ 1 నుంచి జూలై 15 వరకు సాధారణంతో పోలిస్తే 48.3 శాతం వర్షపాతం లోటు నమోదైందని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ వివరించారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 24 జిల్లాలు లోటు వర్షపాతం, నాలుగు జిల్లాలు తీవ్ర లోటు వర్షపాతం కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. అలాగే 8,489 రైతు సేవా కేంద్రాల్లో 1,357 అధిక ప్రమాదం, 2,077 మోస్తరు ప్రమాదం, 5,055 తక్కువ ప్రమాదంగా గుర్తించగా, రాయలసీమ జిల్లాలు అత్యధిక ప్రమాద ప్రాంతాలుగా ఉన్నట్లు వివరించారు.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించాలని, రైతు సేవా కేంద్రాలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా నిరంతర పంట సలహాలు అందించాలని సీఎస్ ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించడంతో పాటు, అత్యవసర పరిస్థితులకు అవసరమైన విత్తనాలను ముందుగానే జిల్లాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులకు అనుకూలమైన ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ (ఖఓఆ), ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, తక్కువ నీటితో సాగు చేసే పంటలను మరింత విస్తరించాలని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయాధికారులు ప్రతిరోజూ పరిస్థితులను పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సూచనలు అందించాలని ఆదేశించారు

xxxxxxxxxxxxxxxxx

# ధరణి అక్రమాలపై సిట్

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడుగంటలపాటు సమావేశమైన మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సందర్భంగా ధరణి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ ట్రైన్, డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల ఆదాయం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి.క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ధరణిపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయడంతో పాటు ధరణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.గ్రామ పంచాయతీల సొంత ఆదాయం పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలనే నిర్ణయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు వీలుగా పలు కొత్త పోస్టుల భర్తీకి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే, పఠాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాలు, ప్రయాణికులకు మరింత లబ్ది చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ క్యాబినెట్ సమావేశంలో గ్రామీణ పల్లెల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 70(3)ను సవరించనున్నారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే నిధులు, సొంత ఆదాయంప్రభుత్వ ట్రెజరీలో జమ అయ్యేవి. దీనివల్ల అత్యవసర గ్రామ వికాస పనులకు నిధులు డ్రా చేయడం సర్పంచులు లేదా స్థానిక అధికారులకు ఆలస్యమయ్యేది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ, ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీతో సంబంధం లేకుండా నేరుగా సదరు గ్రామ పంచాయతీ బ్యాంక్ ఖాతాలోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు ఆమోదం లభించింది. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ చట్ట సవరణను తక్షణమే అమలుల్లోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేయనుంది. ఈ సమావేశంలో దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. మరోవైపు, మంత్రిమండలి నిర్ణయంతో సిట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సిట్ ద్వారా భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లపై విచారణ చేపట్టాలని భావిస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపైనా ప్రత్యేక దృష్టి సారించనుంది. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని భావిస్తోంది. సాంకేతిక అంశాలపై నిపుణుల సహకారంతో దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించింది. ధరణి ద్వారా జరిగిన భూ వివాదాలన్నింటిపైనా వివరాల సేకరణకు కసరత్తు చేస్తోంది. అక్రమంగా లబ్ది పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు, సంబంధిత పత్రాల పరిశీలనను ప్రారంభించాలని తీర్మానించింది. సిట్ ద్వారా ధరణి అక్రమాలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేసింది.

# ముద్రగడకు బలిజ సమాజం అశ్రునివాళి

### బలిజ సమాజానికి ముద్రగడ సేవలు చిరస్మరణీయం

### "మన" అధ్యక్షుడు అరిగెల మనోహర్

**విశాఖపట్నం ప్రతినిధి, జులై 17,(రిపబ్లిక్ న్యూస్):** ప్రముఖ కాపు ఉద్యమ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సేవలను బలిజ కాపు నాయకులు స్మరించుకున్నారు. రాష్ట్ర బలిజ కాపు అసోసియేషన్ అధ్యక్షుడు, "మన" అధ్యక్షుడు అరిగెల మనోహర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. శుక్రవారం విశాఖపట్నంలోని బలిజ కాపు అసోసియేషన్ కార్యాలయంలో ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.




"మన" అధ్యక్షుడు అరిగెల మనోహర్




**ముద్రగడ ఉద్యమాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి**

ఈ సందర్భంగా అరిగెల మనోహర్ మాట్లాడుతూ కాపు, బలిజ తదితర వర్గాల సామాజిక, రాజకీయ హక్కుల సాధన కోసం ముద్రగడ పద్మనాభం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడని కొనియాడారు. వ్యక్తిగత పదవుల కంటే సమాజ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చిన అరుదైన వ్యక్తిత్వం ఆయనదని పేర్కొన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన ఉద్యమాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని చెప్పారు. కాపు సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన చూపిన పట్టుదల, నిబద్ధత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ముద్రగడ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు.

**నాయకుడిగా ఆయన పేరు చిరకాలం గుర్తుండిపోతుంది**

ఈ సందర్భంగా డెక్క సత్యం నాయుడు మాట్లాడుతూ, ముద్రగడ పద్మనాభం మరణం కాపు సమాజానికి తీరని లోటని అన్నారు. సమాజం కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా ఆయన పేరు చిరకాలం గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ముద్రగడ సేవలను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. బలిజ కాపు అసోసియేషన్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సంఘ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముగ్గురు కుటుంబ పెద్దలను కోల్పోయాం

### మా కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ఆదుకోండి

### బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కి వినతి



**శ్రీ సత్యసాయి /నల్లమాడ, జులై 17,(రిపబ్లిక్ న్యూస్):** వరుసగా కుటుంబ పెద్దలను కోల్పోయి తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నల్లమాడ మండలానికి చెందిన చదివే కుటుంబ సభ్యులు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డిని కోరారు. శుక్రవారం ఓబులదేవరచెరువు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. నల్లమాడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు చదివే వెంకటలక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. అంతకుముందే ఆమె కుమారుడు, టీడీపీ సీనియర్ కార్యకర్త, నల్లమాడ మండల డ్రైవర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు చదివే శ్రీనివాసులు గుండెపోటుతో మరణించారని పేర్కొన్నారు. అనంతరం కుటుంబ పెద్ద చదివే కుళ్లాయప్ప కూడా అనారోగ్యంతో కన్నుమూయడంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయిందన్నారు.

**బాధిత కుటుంబం దయనీయ పరిస్థితుల్లో ఉంది:** కుటుంబ సభ్యుల వైద్య చికిత్సల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయడంతో ప్రస్తుతం జీవనాధారం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వినతిపత్రంలో వివరించారు. ప్రస్తుతం వెంకటలక్ష్మమ్మ కోడలు కృష్ణకుమారి, ఆమె ముగ్గురు కుమార్తెలతో కుటుంబం దయనీయ పరిస్థితుల్లో ఉందన్నారు. గతంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి సహాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి ఆర్థిక సాయం, సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డిని కోరారు. బాధిత కుటుంబానికి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# ప్రమాద బాధిత కుటుంబానికి టీడీపీ అండ

### ఎమ్మెల్యే పరిటాల సునీత చేతుల మీదుగా

### రూ.5 లక్షల ప్రమాద బీమా పత్రం అందజేత



**అనంతపురం సంక్షేమం, జులై 17,( రిపబ్లిక్ న్యూస్ ):** రోడ్డు ప్రమాదంలో మరణించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా నిలిచింది. కనగానపల్లి మండలం ముక్తాపురం పంచాయతీ పరిధిలోని పర్వతదేవరపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బాబు సాహెబ్ షేక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, పార్టీ సభ్యత్వం ఆధారంగా ఆయన కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా మంజూరైంది. రెండు నెలల క్రితం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాబు సాహెబ్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఆయన చాలాకాలంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, మృతుడి భార్య రహీంబికి రూ.5 లక్షల ప్రమాద బీమా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. కార్యకర్తలకు ప్రమాద బీమా వంటి భరోసా పథకాలు అందుబాటులో ఉండేలా పార్టీ చర్యలు తీసుకుంటోందని తెలిపారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ చొరవతో కార్యకర్తలకు ఇలాంటి ఆర్థిక సాయం అందుతోందని పేర్కొన్నారు. బీమా మంజూరు చేసిన పార్టీ అధిష్టానానికి, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# జగన్ 2.0 యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

### వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అనంత పిలుపు







**అనంతపురం సంక్షేమం, జులై 17,(రిపబ్లిక్ న్యూస్):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచేందుకు రూపొందించిన 'జగన్ 2.0 సూపర్ యాప్'ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అనంతపురంలోని హెచ్‌ఎల్‌సీ కాలనీలో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. అలాంటి పరిస్థితుల్లో పార్టీ నాయకత్వానికి, కార్యకర్తలకు మధ్య సమర్థవంతమైన అనుసంధాన వేదికగా 'జగన్ 2.0 సూపర్ యాప్'ను రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించడంతో పాటు నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయడమే యాప్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పార్టీకి చెందిన ప్రతి నాయకుడు, కార్యకర్త తప్పనిసరిగా 'జగన్ 2.0 సూపర్ యాప్'ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెగా పేరెంట్-టీచర్ మీట్

### 1,724 పాఠశాలల్లో నిర్వహణ

### 1.28 లక్షల మంది తల్లిదండ్రులకు ఆహ్వానం

**అనంతపురం కలెక్టరేట్, జులై 17,( రిపబ్లిక్ న్యూస్):** జిల్లావ్యాప్తంగా ఈనెల 24న మెగా పేరెంట్-టీచర్ మీట్ (పీటీఎం)ను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి డీఈఓ శ్రీనివాసరావుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 1,724 ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పీటీఎం నిర్వహించ నున్నామని, ఇందులో 10,499 మంది ఉపాధ్యాయులు, 1,28,644 మంది తల్లిదండ్రులు, 1,67,434 మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందని చెప్పారు. ప్రతి విద్యార్థి విద్యా పురోగతి, అభ్యాస స్థాయి, భవిష్యత్ లక్ష్యాలు, మెరుగుపర్చాల్సిన అంశాలపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో వ్యక్తిగతంగా చర్చిస్తారని తెలిపారు. గత ఏడాది అమలు చేసిన గ్యారంటీడ్ ఫంక్షనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (జీఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం ద్వారా సాధించిన పురోగతిని వివరించడంతో పాటు, విద్యార్థుల చదువులో తల్లిదండ్రుల పాత్రపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. గతసారి ఎక్కువగా తల్లులు మాత్రమే పాల్గొన్నారని, ఈసారి తండ్రులు కూడా తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.




**మెగా పీటీఎంలో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ముఖాముఖి**

ప్రభుత్వం అమలు చేస్తున్న లీప్ యాప్ ద్వారా విద్యార్థుల హాజరు, మార్కులు, విద్యా పురోగతి వంటి వివరాలను తల్లిదండ్రులు తెలుసుకోవచ్చని, ప్రతి ఒక్కరూ ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అలాగే పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కోసం రూపొందించిన డోనర్ ప్లాట్‌ఫామ్ గురించి కూడా అవగాహన కల్పించి, దాతలు నేరుగా పాఠశాలలకు అవసరమైన వస్తువులు అందించే అవకాశాన్ని వివరించనున్నట్లు చెప్పారు. మెగా పీటీఎంలో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ముఖాముఖి సమావేశాలు, కెరీర్ గైడెన్స్, స్కిల్ ఎడ్యుకేషన్, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, మాదకద్రవ్యాల నివారణ, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు తల్లుల కోసం రంగోలి, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చెయర్స్, తండ్రుల కోసం టగ్ ఆఫ్ వార్ వంటి వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రతిభావంతుల ప్రసంగాలు, దాతల నమోదు, ప్రశ్నోత్తర కార్యక్రమం అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో అందరూ పాల్గొననున్నారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు ముందస్తుగా ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను ఆహ్వానిస్తారని, ప్రజాప్రతినిధులు, దాతలు, తల్లిదండ్రులు పెద్దఎత్తున పాల్గొని మెగా పీటీఎంను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పిలుపునిచ్చారు.

# జూనియర్ కళాశాల భవనాల ప్రారంభం





### ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం / ఆత్మకూరు, జులై 17,(రిపబ్లిక్ న్యూస్ ):** ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిర్మాణం పూర్తిచేసుకున్న తొలి కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాల వసతి గృహం ఆత్మకూరులోనే ప్రారంభమైందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. ఆత్మకూరు మండల కేంద్రంలో రూ.2.12 కోట్ల ఏడబ్ల్యూపీ నిధులతో నిర్మించిన కేజీబీవీ జూనియర్ కళాశాల నూతన భవనాలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. అంతకుముందు రూ.56 లక్షల ఎన్‌హెచ్‌ఎం నిధులతో నిర్మించనున్న పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనానికి భూమిపూజ నిర్వహించారు. కళాశాల భవనాలను పరిశీలించిన ఎమ్మెల్యే వసతి గృహం, తరగతి గదులు, భోజనశాల, విద్యార్థినులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. భోజనశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు.

**కళాశాలల్లో రాజకీయాలకు తావు ఉండకూడదు**

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య, భవనాలు, భోజనం ఇలా ప్రతి అంశంలో నాణ్యతే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సోలార్ హీటర్లు, మెరుగైన వసతులు కల్పించామని, దొడ్డు బియ్యానికి బదులుగా సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో రాజకీయాలకు తావు ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత ప్రభుత్వంలో విద్యా సామగ్రిపై రాజకీయ ప్రచారం జరిగిందని, ప్రస్తుతం మహనీయుల చిత్రాలతో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22 నుంచి డోనర్ యాప్ ద్వారా పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, దాతల నుంచి పాఠశాలల అభివృద్ధికి విరాళాలు స్వీకరించే కార్యక్రమం ప్రారంభమవుతుందని, దాతలకు ఆదాయపన్ను మినహాయింపు కూడా ఉంటుందని వెల్లడించారు.

**రూ.35 కోట్లతో సీపీడబ్ల్యూఎస్ తాగునీటి పథకం**

ఆత్మకూరు మండలంలో రెండేళ్లలోనే సుమారు రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే వివరించారు. మదిగుబ్బపి.కొత్తపల్లి, ఆత్మకూరు కురాకులపల్లి రహదారుల అభివృద్ధితో పాటు రూ.35 కోట్లతో సీపీడబ్ల్యూఎస్ తాగునీటి పథకం, రూ.6.60 కోట్లతో గొరిదిండ్ల, తోపుదుర్తి 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు.

**ప్రజా దర్బార్‌లో అర్జీల స్వీకరణ**

అనంతరం ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, పింఛన్లు, గ్రామపంచాయతీలు, కమ్యూనిటీ భవనాలకు సంబంధించిన సమస్యలను ఓపిగ్గా విని, తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీకి నిర్దిష్ట పరిష్కారం చూపాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పకుండా సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

# సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలి

### ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డికి జీపీఎస్ఎస్ వినతి

**అనంతపురం సంక్షేమం, జులై 17,( రిపబ్లిక్ న్యూస్):** ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గిరిజన గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడంతో పాటు కాస్మోటిక్ చార్జీలను సకాలంలో విడుదల చేయాలని గిరిజన ప్రజా సంక్షేమ సంఘం (జీపీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గర్మా మల్లికార్జున నాయక్ ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతపురం పట్టణంలోని రోడ్లుభవనాల అతిథి గృహంలో శుక్రవారం ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ గిరిజన గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ సంక్షేమ



హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, కాస్మోటిక్ చార్జీలు సకాలంలో చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే హాస్టళ్లలో వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు స్థానికంగా అందుబాటులో ఉండకపోవడం వల్ల విద్యార్థుల పర్యవేక్షణ దెబ్బతింటోందని ఫుడ్ కమిషన్ సభ్యుడి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల ఆరోగ్యం, మానసిక వికాసంపై ప్రత్యేక దృష్టి సారించి, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న పిల్లలను సొంత బిడ్డల్లా భావించి ఎలాంటి వివక్ష లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రంలో కోరారు. విద్యార్థుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు సూచనలు ఇవ్వాలని ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డిని జీపీఎస్ఎస్ ప్రతినిధులు అభ్యర్థించారు.

# బ్రిడ్జి కింద బంకులు తొలగించొద్దు

### సీపీఎం ధర్నా.. కమిషనర్‌కు వినతిపత్రం





**అనంతపురం ప్రతినిధి, జూలై 17 (రిపబ్లిక్ న్యూస్):** నగరంలో ఉన్న బళ్లారి రోడ్డులోని బ్రిడ్జి కింద ఉన్న చిరు వ్యాపారుల బంకులను తొలగించవద్దని డిమాండ్ చేస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జస్వంత్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

**ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులను ఆదుకోవాలి**

ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి వి. రామిరెడ్డి మాట్లాడుతూ బ్రిడ్జి కింద ఎన్నో ఏళ్లుగా వందకు పైగా కుటుంబాలు చిన్నచిన్న వ్యాపారాల ద్వారా జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. నగర సుందరీకరణ పేరుతో వారిని ఖాళీ చేయించడం పేదల జీవనోపాధిపై దెబ్బ కొట్టడమేనని విమర్శించారు. కరువు ప్రభావిత జిల్లాలో ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాల్సిందిపోయి తొలగించాలని చూడటం సరికాదన్నారు. చిరు వ్యాపారులను పక్కనబెట్టి పెద్ద కంపెనీలకు ప్రాధాన్యం కల్పించే విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. బ్రిడ్జి కింద వ్యాపారం చేస్తున్న వారిని తొలగించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

**రాజకీయ జోక్యానికి అవకాశం కల్పించవద్దు**

వినతిపత్రం స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ జస్వంత్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆ ప్రాంతంలో కంటైనర్ దుకాణాలు ఏర్పాటు చేసి పొదుపు సంఘాలకు కేటాయించే ప్రతిపాదన ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన సీపీఎం నాయకులు, ప్రస్తుతం అక్కడ వ్యాపారం చేస్తున్న వారికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, రాజకీయ జోక్యానికి అవకాశం కల్పించవద్దని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని, అప్పటి వరకు బంకులు తొలగించబోమని కమిషనర్ హామీ ఇవ్వడంతో సీపీఎం నాయకులు ధర్నాను విరమించారు. ధర్నాలో సీపీఎం నాయకులు ముర్తుజా, వెంకటనారాయణ, వలి, లతీఫ్, దస్తగిరమ్మ, గోవిందరాజులు, ప్రసాద్, రఫీ, సుధీర్, ఉసేనప్ప, టింకర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాన్ని అడ్డుకుని మైనర్ బాలిక భవిష్యత్తును కాపాడిన శక్తి టీం కానిస్టేబుళ్లకు ఎస్పీ ప్రశంసలు

### ఆదోనిలో 8వ తరగతి విద్యార్థినికి జరగబోయే బాల్య వివాహం నిలిపివేత

### రాజేశ్వరి, వీరాంజనేయులకు ప్రశంసాపత్రాల ప్రదానం



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 17)** బాల్య వివాహాన్ని అడ్డుకుని ఓ మైనర్ బాలిక భవిష్యత్తును కాపాడడంలో విశేష కృషి చేసిన ఆదోని శక్తి బృందం పోలీసు కానిస్టేబుళ్లు కె. రాజేశ్వరి, ఎస్. వీరాంజనేయులను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

ఇటీవల ఆదోని మండలం ఇస్వి గ్రామానికి చెందిన 8వ తరగతి చదువుతున్న ఓ మైనర్ బాలికకు కుటుంబ సభ్యులు బాల్య వివాహం జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం అందడంతో శక్తి బృందానికి చెందిన కానిస్టేబుళ్లు వెంటనే స్పందించారు. ఐసీడీఎస్, రెవెన్యూ, ఆరోగ్య శాఖలు, గ్రామ సచివాలయ అధికారులతో సమన్వయం చేసుకుని సంఘటనా స్థలానికి చేరుకుని బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, దీని వల్ల బాలిక విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఉంటాయని వారికి అవగాహన కల్పించారు. పోలీసుల సూచనలు, కౌన్సెలింగ్‌తో కుటుంబ సభ్యులు వివాహాన్ని విరమించుకోవడంతో బాలిక విద్యాభ్యాసం కొనసాగేందుకు అవకాశం కలిగింది. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ పిల్లల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. బాల్య వివాహాల వంటి ఘటనలపై పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు కూడా ఎక్కడైనా ఇటువంటి సంఘటనల సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు, డయల్-112కు, చైల్డ్‌లైన్-1098కు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. పిల్లల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేసి బాల్య వివాహాన్ని అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించిన శక్తి బృందం కానిస్టేబుళ్లు రాజేశ్వరి, వీరాంజనేయులతో పాటు సహకరించిన ఇతర శాఖల సిబ్బందిని కూడా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మస్తాన్ వలి పాల్గొన్నారు.

## సైబర్ మోసానికి గురైన బాధితుడికి రూ.4 లక్షలు తిరిగి అందజేత

**గుజరాత్‌లో నిందితుల గుర్తింపు -నగదు రికవరీ చేసిన కర్నూలు నాల్గవ పట్టణ పోలీసులు ; అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచన**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 17)**సైబర్ మోసానికి గురై రూ.4 లక్షలు కోల్పోయిన బాధితుడికి కర్నూలు నాల్గవ పట్టణ పోలీసులు ఆ మొత్తాన్ని తిరిగి అందజేసి తమ పనితీరుకు మరోసారి నిదర్శనంగా నిలిచారు. కర్నూలు పట్టణానికి చెందిన దండు నాగరాజు తెలియని యోనో యాప్ లింక్‌ను క్లిక్ చేయడంతో ఆయన మొబైల్ ఫోన్, బ్యాంకు ఖాతా హ్యాక్‌కు గురయ్యాయి. దీంతో ఆయన ఖాతా నుంచి సుమారు రూ.4 లక్షలు వివిధ క్రెడిట్ కార్డులకు బదిలీ అయ్యాయి. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి సహకారంతో డెబిట్ అయిన బ్యాంకు ఖాతాలను సాంకేతికంగా విశ్లేషించి నిందితుల ఆచూకీని గుర్తించారు. నాల్గవ పట్టణ సీఐ విక్రమ్ సింహ ఆధ్వర్యంలో ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ జీసస్‌లతో కూడిన ప్రత్యేక బృందం గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌కు వెళ్లి నిందితులు యాసిన్ యూసుఫ్ భాయ్ పిపాద్వాలా, ఆవేశ్ యాసిన్ పిపాద్వాలాలను గుర్తించి అదుపులోకి తీసుకుంది. అనంతరం వారిని స్థానిక పోలీసులకు అప్పగించి చట్టపరమైన చర్యలు చేపట్టారు. నిందితుల నుంచి సైబర్ మోసం ద్వారా అపహరించిన రూ.4 లక్షలను రికవరీ చేసి అవసరమైన చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం బాధితుడు దండు నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ, ప్రజలు తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పిన్ నంబర్లు ఎవరికీ చెప్పవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కర్నూలులో ఘనంగా వైఎస్ఆర్సీపీ 2.0 సూపర్ యాప్ ప్రారంభోత్సవం

**పార్టీ బలోపేతానికి యాప్ కీలకం కార్యకర్తలు విస్తృతంగా వినియోగించుకోవాలని నేతల పిలుపు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 17)** వైఎస్ఆర్సీపీ 2.0 సూపర్ యాప్ ప్రారంభోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లాలో పార్టీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఎస్వీ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు చెల్లా విగ్నేశ్వర్ రెడ్డి పాల్గొని వైఎస్ఆర్సీపీ 2.0 సూపర్ యాప్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పార్టీ కార్యకర్తలు యాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ యాప్ దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని యాప్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు. వైఎస్ఆర్సీపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో 2.0 సూపర్ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

## బీమా చెక్కు అందజేసిన కమిషనర్

**ఎస్‌బీఐ బీమా పథకం ద్వారా మృత ఉద్యోగి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 17)** బీమా పథకాలు ఉద్యోగుల కుటుంబాలకు క్లిష్ట సమయంలో ఆర్థిక భరోసాను కల్పిస్తాయని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. నగరపాలక సంస్థలో రెగ్యులర్ ఉద్యోగి (పిహెచ్ వర్కర్)గా పనిచేస్తూ ఇటీవల మరణించిన బైరపోగు దేవరాజు కుటుంబానికి ఎస్‌బీఐ శాలరీ ఖాతాకు అనుబంధంగా ఉన్న బీమా పథకం ద్వారా మంజూరైన రూ.10 లక్షల బీమా చెక్కును ఆయన కుమారుడికి కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి తనకు అందుబాటులో ఉన్న బీమా, సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇటువంటి పథకాలు కుటుంబాలకు అత్యవసర సమయంలో ఆర్థిక భద్రతను కల్పిస్తాయని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, నగరపాలక సంస్థ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. నగరపాలక సంస్థలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగి విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1 కోటి, సహజ మరణం సంభవిస్తే రూ.10 లక్షల బీమా ప్రయోజనం అందించే ఎస్‌బీఐ బీమా పథకాలు అమలులో ఉండటం అభినందనీయమని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ రఘునందన్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ సురేష్ బాబు, రీజినల్ కార్యాలయ సిబ్బంది గుప్తా, పుల్లమ్మ, కేఎంసీ బ్రాంచ్ మేనేజర్ సూర్య, ఉద్యోగుల సంఘ నాయకులు జియా, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలూరు నియోజకవర్గ బిజెపి బిఎల్ఓ వన్ గుమ్మనూరు నారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర బోయ వాల్మీకి సమితి ఫౌండర్ తలారి అంజి





**చిప్పగిరి, జూలై, 17,( రిపబ్లిక్ న్యూస్)** ఆలూరు నియోజకవర్గం బిజెపి బిఎల్ఓ వన్ గుమ్మనూరు నారాయణ శుక్రవారం రాష్ట్ర బోయ వాల్మీకి సమితి పౌడర్ తలారి అంజి, మరియు అరికెర గ్రామ సర్పంచ్ నాగరాజు, గుంతకల్ కార్యాలయం నందు కలిసి శాలువాతో సన్మానించారు, ఈ కార్యక్రమంలో మహేంద్ర నాయుడు, వీరన్న, వీరేశ్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

## సంజీవని ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**ఆస్పరి పీహెచ్‌సీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి -ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి అధికారులకు ఆదేశాలు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 17)** ఈ నెల 25న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆస్పరి పీహెచ్‌సీని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణ, వైద్య సేవల అందుబాటు, మౌలిక వసతులు, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

జిల్లాలో సాధారణ ప్రసవాలు అధికంగా జరిగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆస్పరి పీహెచ్‌సీ ఒకటిగా నిలవడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్య సిబ్బంది మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రతిరోజు ఓపీ సేవలు పొందుతున్న రోగుల సంఖ్య, నెలవారీ ప్రసవాల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని రక్త పరీక్షల గది, సంజీవని అరినా కేంద్రం, ఫార్మసీ, ఆరోగ్య మిత్ర హెల్ప్‌డెస్క్, ప్రసూతి విభాగం, వార్డులు, ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత, వైద్య పరికరాల వినియోగం, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అవసరమైన మరమ్మత్తులు, రంగులు వేయడం, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు, సూచిక బోర్డులు తదితర ఏర్పాట్లను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చిన రోగులతో కూడా కలెక్టర్ మాట్లాడారు. వైద్య సేవలు, పరీక్షలు, మందుల సరఫరాపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యం సంతృప్తికరంగా అందుతోందని రోగులు వెల్లడించడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, టీడీపీ నాయకులు గుడిసె కృష్ణమ్మ, వైకుంఠం జ్యోతి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ హామీతో ముగిసిన ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

**అర్హత ఉన్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తాం: తహసిల్దార్ పుణ్యవతి**



**అనంతపురం/గుత్తి, జూలై 17: ( రిపబ్లిక్ న్యూస్)**మూడు రోజులుగా గుత్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న ఏపీ ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలకు శుక్రవారం తెరపడింది. దీక్షా శిబిరాన్ని సందర్శించిన తహసీల్దార్ పుణ్యవతి, అర్హులైన నిరుపేదలకు నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసనకారులు తమ ఆందోళనను విరమించారు. ఇళ్ల స్థలాల కోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న నిరుపేదలకు న్యాయం చేయాలని కోరుతూ ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ రిలే దీక్షలు చేపట్టారు. మూడో రోజు తహసీల్దార్ పుణ్యవతి దీక్షా శిబిరానికి చేరుకుని ప్రతినిధులతో చర్చించారు. దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన వారికి ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. దీంతో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు దీక్షను విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ ప్రసాద్ మాట్లాడుతూ, నిరసనకు సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చిన తహసీల్దార్ పుణ్యవతికి కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన హామీని అధికారులు త్వరితగతిన అమలు చేసి, భూమిలేని అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడవి రాముడు, హరికృష్ణ,కుళ్లాయి, రవి, సుంకమ్మ, శివమ్మ,అపర్ణ,అనిత, లాలె ప్ప, శివశంకర్,సంజీవ, విజయవర్ధన్,ఆటో అంజి రామాంజినేయులు,లాలు,ఓబులేసు, సలీం, తదితరులు పాల్గొన్నారు

## సైబర్ విభాగానికి కార్పొరేట్ చేయూత

**ఫోర్టినెట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్**

**రూ.10 లక్షల విలువైన 20 ల్యాప్‌టాప్‌లు వితరణ**





**అనంతపురం క్రైమ్, జూలై 17, (రిపబ్లిక్ న్యూస్):** సైబర్ నేరాల దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచడంతో పాటు డిజిటల్ మౌలిక వసతుల బలోపేతానికి కార్పొరేట్ సంస్థ ఫోర్టినెట్ చేయూతనందించింది. సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లా పోలీసులకు రూ.10 లక్షల విలువైన 20 అత్యాధునిక ల్యాప్‌టాప్‌లను శుక్రవారం అందజేసింది. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఫోర్టినెట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్, ఏజీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎ.జి. అనిల్ కుమార్‌తో కలిసి జిల్లా ఎస్పీ పి. జగదీష్‌కు ల్యాప్‌టాప్‌లను అందించారు.

**సైబర్ విభాగానికి అత్యాధునిక ల్యాప్‌టాప్‌లు**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ఫోర్టినెట్ అందించిన సహకారం జిల్లా పోలీసు శాఖకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రక్షక్ స్కూల్‌లో డిజిటల్ విద్యా సదుపాయాల విస్తరణతో పాటు జిల్లా సైబర్ క్రైమ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ మౌలిక వసతుల బలోపేతానికి ఈ ల్యాప్‌టాప్‌లు దోహదపడతాయని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాల నియంత్రణలో మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు.

**సాంకేతికంగా మరింత బలోపేతం చేయడం సంస్థ లక్ష్యం**

ఫోర్టినెట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థను సాంకేతికంగా మరింత బలోపేతం చేయడం తమ సంస్థ లక్ష్యమన్నారు. మరో రూ.20 లక్షల విలువైన హైఎండ్ ల్యాప్‌టాప్‌లను పది రోజుల్లో అనంతపురం జిల్లా పోలీసులకు అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమం అనంతరం ఫోర్టినెట్ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్‌ను జిల్లా ఎస్పీ పి. జగదీష్ శాలువాతో సన్మానించారు. సీఎస్ఆర్ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఫోర్టినెట్ సంస్థ ప్రతినిధులతో పాటు సమన్వయం చేసిన ఏజీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎ.జి. అనిల్ కుమార్‌కు ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కాఫర్ కేటుగాళ్లా .. మజాకా?

**పక్కా ప్రణాళికతో కాఫర్ వైరు దొంగతనాలు**

**పోలీసులకు సవాలుగా కాఫర్ వైరు వరుస చోరీలు**

**మరో సారి భోజనం గ్రామం వద్ద 40 విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ**

**వారం గడవక ముందే రెండో సారీ కాఫర్ వైరు దొంగతనాలు**

**బండి ఆత్మకూరు మండలంలో నిత్య కృత్యంగా కాపర్ వైర్ దొంగతనాలు**

**అదనపు భారంతో దిక్కుతోచని స్థితిలో రైతన్నలు**

**కోట్టేసిన వైరు ఎక్కడ విక్రయిస్తున్నారో**

**బండి ఆత్మకూరు, జూలై 17, (రిపబ్లిక్ న్యూస్ ):-** కాపర్ వైర్ కేటుగాళ్లు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. అలాగే వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సైతం సవాలు విసురుతున్నారు. తమను పట్టుకోవడం ఎవరికి సాధ్యం కాదన్నట్టు తరచు ఏదో ఒకచోట కాఫర్ వైర్ దొంగిలిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. దొంగల ముఠా చేస్తున్న కాఫర్ వైర్ దొంగతనాలతో రైతన్నలు బెంబేలెత్తిపోతున్నారు. గత వారం రోజుల వ్యవధిలోనే బండి ఆత్మకూరు మండల వ్యాప్తంగా మూడు,నాలుగు సార్లు వైర్లు కోసుకు వెళ్లి రైతాంగానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున బండి ఆత్మకూరు మండలం, భోజనం గ్రామం వద్ద సుమారు 30 మంది రైతులకు చెందిన 40 మోటార్ల కాపర్ వైర్లు దొంగిలించారు. భోజనం గ్రామా శివారులోని కుందునదికి ఏర్పాటుచేసిన సుమారు 40 విద్యుత్తు మోటర్ల కాఫర్ వైరు కోసుకెళ్లారు. గ్రామానికి చెందిన సముద్రాల సత్యారాజు, మనోహర్, గోవిందరెడ్డి, సత్య నారాయణ, దిబ్బన్న, జింగిరన్న, చిన్న ఉసేని, చిన్న సంజీవ రాయుడు లతో పాటు మరింత మంది విద్యుత్ మోటార్ల వైర్లను దుండగులు కోసుకువెళ్ళారు. కాఫర్ కేటుగాళ్లు విద్యుత్ మోటార్ల వైర్లు కోసిన విధానం చూస్తే ఒక పథకం ప్రకారం ముఠాగా ఏర్పడి వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఒక కిలోమీటర్ పరిధిలో సుమారు 40 విద్యుత్ మోటార్ల వైర్లను కోసుకు వెళ్లాలంటే చాలా సమయం పడుతుంది. అలాంటిది దొంగల ముఠా రాత్రికి రాత్రే కోసి వాటిని ఒక్కొక్కటిగా విడదీసి అందులో ఉన్న కాపర్ వైర్ ఎత్తుకెళ్లడం చూస్తే దొంగలు ప్రణాళికా బద్ధంగా చేస్తున్నట్లు తెలుస్తోంది. బండి ఆత్మకూరు మండలంలో విద్యుత్ మోటార్ల కాఫర్ వైర్ దొంగతనాలు నిత్యకృత్యంగా మారాయి. ప్రతి నాలుగైదు రోజులకు ఒకసారి ఏదో ఒకచోట.. ఏదో ఒక గ్రామంలో వైర్లు కోసుకెళ్ళిన ఘటన తరచూ జరుగుతూనే ఉంది. అయినప్పటికీ పోలీసులు వారిని పట్టుకోలేకపోవడం మండల వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా పంట వేసే సమయం కావడంతో రైతులు అందరూ విద్యుత్ మోటార్ లో అమర్చుకున్నారు. ఇదే అదునుగా భావించిన కాఫర్ వైర్ కేటుగాళ్లు రాత్రి వేళల్లో సంచరిస్తూ కాఫర్ వైరు దొంగిలిస్తున్నారు. దీంతో బాధిత రైతులకు అదనపు భారం పడుతుంది. రాత్రికి రాత్రే వైర్లు కోసుకు వెళుతుండడంతో మళ్లీ వేల రూపాయలు ఖర్చుపెట్టి కాపర్ వైర్ అమర్చుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది. మోటారుకు కాపర్ వైర్ అమర్చకపోతే సాగునీరు సాగునీరు పారే పరిస్థితి లేదు. ఇంకా ఎన్నాళ్ళని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు విద్యుత్ మోటార్ల కాపర్ వైర్ లు దొంగతనం చేసే దొంగల ముఠా పై దృష్టి సారించి రైతన్నలకు న్యాయం చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాపర్ వైర్ ఒక మీటరు రూ 110 రూపాయల నుంచి 150 రూపాయల వరకు ధర ఉంది. అలాంటిది ఒక్కో మోటారుకు ఒక్కో రైతు సుమారు 15 మీటర్ల నుంచి 30,40 మీటర్ల వరకు అమర్చుకోవాల్సి ఉంటుంది. అయితే పంట చేతికి వచ్చేలోపు మూడు, నాలుగు సార్లు దొంగతనం జరగడం రైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వరుస దొంగతనాలపై బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి ఫలితం కనిపించడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు కాఫర్ వైర్ దొంగతనాల ముఠాపై దృష్టి సారించి రైతులకు తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు.



కాపర్ వైర్ ఎత్తుకెళ్లిన దృశ్యం

# స్థానిక క్యాడర్ల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**: కలెక్టర్ డా. ఏ.సిరి -డ్రాఫ్ట్ జీవో ప్రకారం 7 దశల్లో ఉద్యోగుల కేటాయింపు**

**ప్రక్రియ తప్పుడు వివరాలు సమర్పిస్తే కఠిన చర్యలు - ఫైనల్ జీవో వచ్చిన తర్వాత తదుపరి చర్యలు**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 17)**
స్థానిక క్యాడర్లకు ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్2025 ప్రకారం జారీ చేసిన డ్రాఫ్ట్ జీవో ఆధారంగా చేపట్టాల్సిన ప్రిపరేటరీ వర్క్‌పై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫైనల్ జీవో ఇంకా విడుదల కాలేదని, ప్రస్తుతం అమల్లో ఉన్న డ్రాఫ్ట్ జీవో ప్రకారం స్థానిక క్యాడర్ల కేటాయింపు ప్రక్రియను మొత్తం ఏడు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి దశలో క్యాడర్ స్ట్రెంగ్త్, డ్రాఫ్ట్ సీనియారిటీ జాబితాల పరిశీలనతో పాటు లీవ్, డెప్యుటేషన్, సస్పెన్షన్, ప్రొబేషన్, ట్రైనింగ్, అనధికార గైర్హాజరు ఉద్యోగుల వివరాలను సేకరిస్తామని చెప్పారు. డ్రాఫ్ట్ సీనియారిటీ జాబితా కేటాయింపుల కోసం మాత్రమే ఉపయోగించబడుతుందని, తప్పుడు వివరాలు సమర్పించిన ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండో దశలో డ్రాఫ్ట్ సీనియారిటీ జాబితా ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణకు ఐదు రోజుల గడువు ఇస్తామని తెలిపారు. ఇదే సమయంలో ఉద్యోగులు తమ ఆప్షన్ ఫారమ్‌లను సమర్పించాల్సి ఉంటుందని, ఒకసారి ఇచ్చిన ఆప్షన్‌ను మార్చుకునే అవకాశం ఉండదన్నారు.
మూడో దశలో ప్రెసిడెన్షియల్ ఆర్డర్2025 ప్రకారం ఫైనల్ క్యాడర్ స్ట్రెంగ్త్, వర్కింగ్ స్ట్రెంగ్త్ ఆధారంగా స్థానిక క్యాడర్లకు కేటాయింపులు చేపడతామని చెప్పారు. వితంతువులు, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్న ఉద్యోగులు, అనారోగ్యంతో ఉన్న పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు. అలాగే ఎస్సీ ఉపవర్గీకరణ, ఎస్టీ ఉద్యోగులకు నిష్పత్తి ఆధారంగా కేటాయింపులు అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక క్యాడర్ కేటాయింపు అనంతరం బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుంచి ఏడు రోజుల్లోపు సంబంధిత స్థానంలో విధుల్లో చేరాల్సి ఉంటుందని తెలిపారు. భార్యాభర్తల (స్పౌస్) కేసుల్లో ఉద్యోగులు విధుల్లో చేరిన అనంతరం దరఖాస్తు చేసుకోవచ్చని, ఖాళీల లభ్యత ఆధారంగా వారి అభ్యర్థనలను పరిశీలిస్తామని చెప్పారు. అయితే స్పౌస్ కేసుల ద్వారా బదిలీ పొందిన ఉద్యోగులు సంబంధిత క్యాడర్‌లో తమ సీనియారిటీని వదులుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.
కేటాయింపులో అన్యాయం జరిగిందని భావించే ఉద్యోగులు సంబంధిత ప్రభుత్వ శాఖ కార్యదర్శికి బదిలీ ఉత్తర్వులు అందిన తేదీ నుంచి ఏడు రోజులలోపు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. జీవో నెం.46, జీవో నెం.54లను అధికారులు, ఉద్యోగులు పూర్తిగా అధ్యయనం చేసి సందేహాలు ఉంటే శాఖాధిపతులను సంప్రదించాలని సూచించారు.

# దామగట్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు శక్తి యాప్, సైబర్ భద్రత, పోక్సో చట్టంపై అవగాహన






**నంద్యాల క్రైం, జూలై 17, (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు, ఆత్మకూరు డీఎస్పీ శ్రీ రామాంజి నాయక్ గారి పర్యవేక్షణలో, బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ మణికంఠ గారి ఆధ్వర్యంలో
దామగట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శక్తి యాప్, సైబర్ భద్రత, పోక్సో చట్టంపై డీఎస్పీ రామాంజి నాయక్ పర్యవేక్షణలో, బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ మణికంఠ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి హెడ్‌మిస్ట్రెస్ పి. రెజినా అనుమతితో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 160 మంది విద్యార్థి, విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి. వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, విజయకుమారి, లక్ష్మీనారాయణ శెట్టి, మోహనరావు, నజీర్, పీఈటీ సుంకన్న, దామగట్ల జీఎంఎస్‌కే జి. లక్ష్మి, ఆత్మకూరు శక్తి టీమ్‌కు చెందిన పీసీ రసూల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మణికంఠ విద్యార్థులకు మహిళలు, బాలికల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. అలాగే శక్తి వాట్సాప్ నంబర్ 7993485111, అత్యవసర సేవల కోసం 112, పోలీస్ సహాయం కోసం 100 నంబర్ల వినియోగాన్ని వివరించారు. పాఠశాలలో లేదా పాఠశాలకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, వేధింపులు లేదా అసభ్యకర ప్రవర్తన ఎదురైతే వెంటనే శక్తి యాప్ ద్వారా లేదా సంబంధిత హెల్ప్‌లైన్‌ల ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీస్ శాఖ బాధితులకు అండగా నిలుస్తుందని తెలిపారు. అదేవిధంగా పోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, అలాగే సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న నగదును తిరిగి పొందే అవకాశాలు ఉంటాయని వివరించారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించిన ఎస్ఐ, ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లిన తర్వాత తమ తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లలో శక్తి యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మహిళల భద్రత, చట్టాలపై అవగాహన, సైబర్ భద్రత, అత్యవసర సేవల వినియోగంపై విస్తృత అవగాహన కల్పించారు.

# వృత్తి నైపుణ్యాలతో జీవనోపాదులు పెంచుకోవాలి

**ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి విజయ్ కుమార్**



**పాణ్యం ప్రతినిధి జులై 17 ప్రజా రిపబ్లిక్ న్యూస్ :** స్థానిక మండలంలోని ఇందిరా కాలనీ చెంచు (గిరిజనులు) వృత్తి నైపుణ్యాలతో జీవనోపాదులు పెంచుకొని ఆర్థికంగా బలపడాలని నంద్యాల జిల్లా ప్రొహిబిషన్,ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంట్ అధికారి విజయకుమార్ అన్నారు.మండల కేంద్రంలో ఇందిరా చెంచు కాలనీలో శుక్రవారం జిల్లా కలెక్టర్,నంద్యాల ప్రొబిషన్,ఎక్సైజ్ జిల్లా అధికారి రవికుమార్ ఆదేశాల మేరకు నవోదయం 2.0 గిరిజనులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల ఉపాధికి సంబంధించి కుట్టు మిషన్,పేపర్ ప్లేట్స్, యువతకు మెకానిక్,ప్లంబర్, ఎలక్ట్రికల్,డ్రైవింగ్ వృత్తి నైపుణ్యాల గురించి వివరించారు.అనంతరం గిరిజన పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తాసిల్దార్ ప్రవీణ్ కుమార్,ఎంఈఓ 2 సుబ్రహ్మణ్యం,ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి తనిఖీ చేసి పాఠశాల విద్యార్థులతో భోజనం చేయడం జరిగింది.



గిరిజన పాఠశాలలో విద్యార్థులతో మధ్యాహ్న భోజనము చేస్తున్న తహశీల్దార్ ప్రవీణ్ కుమార్

# అనారోగ్యంతో మృతి చెందిన పులికొండ కుటుంబానికి మండల పరిషత్ కార్యాలయం 40 వేలు ఆర్థిక సహాయం



**చిప్పగిరి, జూలై, 17,( రిపబ్లిక్ న్యూస్)**
చిప్పగిరి ఇటీవల మండల పరిషత్ కార్యాలయంలో హెల్పర్ పనిచేస్తున్న కొక్క పులికొండ అనారోగ్యంతో మృతిచెందగా ఆ కుటుంబానికి ఎంపీడీవో అల్లా బకాస్ ఆధ్వర్యంలో శుక్రవారం 40 వేలు ఆర్థిక సహాయం అందజేశారు, ఎంపీడీవో మాట్లాడుతూ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్జిఎస్ సిబ్బంది, సానుభూతి తెలియజేస్తూ మా వంతు సహాయంగా అందించామని తెలిపారు, ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు, ఏవో శ్రీనివాసులు, సచివాలయ డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు బాలన్న, సురేంద్ర, సిసింద్రీ, ప్రమీల, హరిబాబు, కార్యాలయ సిబ్బంది ప్రియ, తదితరులు పాల్గొన్నారు

# ఆర్థిక మోసానికి గురైతే వెంటనే 1930 కి కాల్ చేయండి

**చిప్పగిరి ఎస్సై సి. వెంకట నరసింహులు**





**చిప్పగిరి, జూలై, 17,( రిపబ్లిక్ న్యూస్)** ఆర్థిక మోసానికి ఎవరైనా గురైతే వెంటనే 1930 కి కాల్ చేయాలని చిప్పగిరి ఎస్సై సి.వెంకట నరసింహులు శుక్రవారం నేమకల్ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఎస్సై మాట్లాడుతూ పాస్వర్డు, ఓటిపి, పిన్ నంబర్లు, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని మరియు మద్యం లేదా ఇతర మత్తు పదార్థాలను తీసుకొని వాహనం నడపరాదని, ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ మాట్లాడరాదని, మరియు బాల్యవివాహాల వల్ల బాలికల చదువు మధ్యలోనే ఆపేయాల్సి వస్తుందని, వాళ్ల విద్యా భవిష్యత్తు నాశనమవుతుందని, చిన్న వయసులోనే బాధ్యతలు మోయలేక బాలికలు మానసిక ఒత్తిడి కి గురవుతారని ఎస్సై సి. వెంకట నరసింహులు తెలిపారు, ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# హౌస్ బ్రేకింగ్ కేసులో ముద్దాయి అరెస్ట్



**పాణ్యం ప్రతినిధి జులై 17 (ప్రజా రిపబ్లిక్ న్యూస్),** 2026 సంవత్సరం జూలై 12వ తేదీన సాయంత్రం పాణ్యం మండలం కొండజూటూరు గ్రామానికి చెందిన వన్నం విజయలక్ష్మి ఇంటిలో, ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాన్ని ఉపయోగించి లోనికి ప్రవేశించి, బీరువాలో ఉన్న నగదు రూ. 3,24,000/-ను అపహరించారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పాణ్యం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి కేసు నమోదు చేశారు.
నంద్యాల యస్ పి సునీల్ షోరాన్ ఐ పీ ఎస్ ఆదేశాల మేరకు, దర్యాప్తులో భాగంగా నంద్యాల ఎస్‌డీపీఓ సుష్మిత, ఐ పీ ఎస్ పర్యవేక్షణలో, పాణ్యం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి మరియు సిబ్బంది సూర్య, నాగరాజు, వెంకటేష్ నాయక్ మరియు నాగార్జునలు సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించడం, సాంకేతిక ఆధారాలను సేకరించడం ద్వారా ముద్దాయి మంజలి వెంకట రమణ (తండ్రి: లక్ష్మణ్, వయస్సు: 36 సంవత్సరాలు, నివాసం: కొండజూటూరు గ్రామం, పాణ్యం మండలం)ను 17-07-2026 తేదీ ఉదయం కొండజూటూరు గ్రామ శివారులోని కొట్టాల రహదారి వద్ద ఉన్న మామిడి తోటలో అరెస్ట్ చేశారు.ముద్దాయి వద్ద నుండి చోరీకి గురైన నగదు రూ.3,24,000/-తో పాటు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు పంపించడమైనది. త్వరిత గతిన కేసును చేధించినందుకు పాణ్యం సి ఐ,యస్ ఐ మరియు సిబ్బంది ని నంద్యాల ఎస్పీ సునీల్ షోరాన్ మరియు నంద్యాల ఐ పి ఎస్ సుష్మిత ప్రత్యేకంగా అభినందించారు.

# రాయికల్ పట్టణములో ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కటకం రవీందర్ తురగా సౌజన్య శ్రీధర్ రెడ్డి



**రాయికల్ పట్టణం జులై,17( రిపబ్లిక్ న్యూస్)**
ఎన్నికల సంఘం ప్రతిష్టత్మకంగా నిర్వహిస్తున్న సార్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో మున్సిపల్ చైర్మన్ కటుకం రవీందర్ ఆధ్యర్యంలో స్థానిక కౌన్సిలర్లు మరియు నాయకులతో కలిసి స్థానిక బి ఎల్ ఓ లు నిర్వహిస్తున్న ఓటర్ నమోదు పక్రియను పరిశిలించి మిగిలిన వాటిని కూడ పూర్తి స్థాయిలో చేయగలరని కోరడం జరిగింది
ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి, పట్టణ మరియు మండల బి.ఆర్.యస్ పార్టీ అధ్యక్షులు ఎలిగేటి అనిల్, బర్కం మల్లేష్, కౌన్సిలర్ భూక్య రాకేష్ నాయక్, నాయకులు కొయ్యాడి మహిపాల్ రెడ్డి, బత్తిని నాగరాజు, కట్కం సాయి, జిల్లాల సుధాకర్, సతీష్ రెడ్డి మరియు బి ల్ ఓ లు పుష్పలత, రాజేశ్వరి,సుమలత పాల్గొన్నారు

# అలీయా నాయక్ తండాలో ఐదు దశాబ్దాల నుండి సాగు చేస్తున్న భూమిని సర్వే చేసి లబ్ధిదారులకు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్





**రాయికల్ పట్టణం జూలై,17( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అలియా నాయక్ తండ గ్రామ రైతులు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు సురేందర్ నాయక్ ఆధ్వర్యంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని కలిసి తమ భూములు తమ పేరు మీద పట్టా ఇప్పించాలని కోరగా స్పందించిన ఎమ్మెల్యే రైతులతో కలిసి జగిత్యాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ని, ఆర్ డి ఓ మధుసూదన్ ని కలిసి అలియా నాయక్ తండ గ్రామంలో సర్వేనెంబర్ 26 ,156 లో 108 మంది రైతులు తమ పేరు మీద పట్టాలు లేక ఇబ్బంది పడుతున్నారని వ్యవసాయానికి కావలసిన ఎరువులు కూడా పొందలేక,పండించిన పంట అమ్ముకోలేకపోతున్నారని గత ఐదు దశాబ్దాల నుండి కబ్జాలో ఉంటూ సాగు చేసుకుంటున్నరని ఎమ్మెల్యే వివరించగా స్పందించిన జిల్లా కలెక్టర్ రెవెన్యూ యంత్రాంగంతో సర్వే చేపించి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గణేష్, సర్పంచ్ ఆకుల మల్లేశం, నాయకులు సంతోష్ నాయక్, రాగి శ్రీనివాస్,మహేష్ నాయక్,గంగాధర్ నాయక్, సురేష్ నాయక్, కిషన్ నాయక్, ప్రవీణ్, బక్య నాయక్,రమేష్ నాయక్ రైతులు తదితరులు పాల్గొన్నారని రాయికల్ మాజీ మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజి మహేందర్ బాబు తెలిపారుఅలాగే ఎమ్మెల్యే సంజయ్ కుమార్ జగిత్యాల రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జగిత్యాల రూరల్ అర్బన్ మండలాల స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ ప్రోగ్రాం పై జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆర్డిఓ మధుసూదన్ గౌడ్ ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో హాఖిమ్ రామ్మోహన్, రెవెన్యూ అధికారులు,బిఎల్వోలు పాల్గొన్నారు

## తెలంగాణ రక్షణ సేన ఆందోల్ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా

# మాసన్న గారి బాలయ్యను ప్రకటించిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత



**ఆందోల్ జులై 17 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఆందోల్ అసెంబ్లీ తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కె కవిత గారు తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్యేల మొదటి జాబితా లిస్టులో మాజీ జెడ్పి చైర్మన్ మాసన్న గారి బాలయ్య పేరును ఆందోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం జరిగింది ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన ఆందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాలయ్య మాట్లాడుతూ నాకు ఆందోల్ నియోజకవర్గం తెలంగాణ రక్షణ సేన పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను ప్రకటించినందుకు తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కె కవిత కు కృతజ్ఞతలు తెలిపారు అనంతరం చిట్కుల్ గ్రామంలో శ్రీ చాముండేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అలాగే అన్నాసాగర్ ముర్షద్ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి పబ్బతి హనుమాన్ దేవాలయం రోడ్డుపై టపాసులు కాల్చి స్వీట్లు ఒకరికి ఒకరు తినిపించుకున్నారు అలాగే ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు అలాగే పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియపరచారు ఆందోల్ నియోజకవర్గం లో ఎప్పుడు ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలు వచ్చిన గెలుపు దిశగా ముందుకు సాగుతామని సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఖలీల్ రామ్ రెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# మహిళ సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన రేగుంట సర్పంచ్




**మల్లాపూర్ జులై 18 (రిపబ్లిక్ న్యూస్)**రేగుంట గ్రామంలో మహిళ సంఘ భవన నిర్మాణానికి సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ శంకుస్థాపన చేశారు. కాగా సర్పంచ్ తో పాటు పిఅర్ ఏ.ఈ రాగసుధ, కార్యదర్శి వినీత, పాలకవర్గ సభ్యులు, భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళ సంఘ సభ్యులకు భవనం నిర్మించుకోవడానికి రూ.10 లక్షలు మంజూరు చేసిందనిమహిళా సంఘ సభ్యులు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గనవేని నందిని మల్లేష్, కార్యదర్శి వినీత, కారోబార్ సుధాకర్ వార్డు సభ్యులు కలసాని రాజన్న, కత్తి నరేష్, బాస రాజరెడ్డి, బొల్లారపు పుష్ప నాయకులు నల్ల రాజేశం, సురకంటి తిరుపతి రెడ్డి, మూడంపల్లి రమేష్, రాజోజి సాయిరాం, బండారి వెంకటేష్ మాజీ సర్పంచులు నిమ్మల భూమారెడ్డి, రంగు రామాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త మేనేజర్ గా జి. ప్రదీప్ కుమార్



**రాయికల్ పట్టణం జూలై 17 ( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ నూతన మేనేజర్ గా జి ప్రదీప్ కుమార్ పదవి భాధ్యతలు స్వీకరించారు ఇక్కడ విధులు నిర్వహించిన పవన్ కుమార్ బదిలీపై గోదావరిఖనికి వెళ్లగా హైదరాబాద్ నుంచి బదిలీపై వచ్చిన ప్రదిప్ కుమార్ రాయికల్ శాఖ మేనేజర్ నియమితులయ్యారు ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది నూతన మేనజర్ కు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు

# అల్లిపుర్ లో గంగమ్మ తల్లి దేవాలయ నిర్మాణంకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**రాయికల్ పట్టణం జూలై,17( రిపబ్లిక్ న్యూస్)**జగిత్యాల జిల్లా రాయికల్ మండల అల్లిపూర్ గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కలిసి అల్లిపూర్ గ్రామంలో గంగమ్మ తల్లి దేవాలయం నిర్మాణం మరియు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా కార్యదర్శి యం.ఏ.మోఖీద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కి వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే కి సంఘ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అల్లీపూర్ గంగపుత్ర సంఘ అధ్యక్షులు తోపారపు ప్రశాంత్, వార్డ్ మెంబర్ కల్లెడ గంగాధర్, ఉపాధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి కల్లెడ రాకేష్,అర్మూళ్ల పవన్, పళ్ళికొండ గంగాధర్, రవి, రెడ్డి, రాహుల్, శంకర్, శివకుమార్, నాయకులు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రావు, దొబ్బల వేణు తదితరులు పాల్గొన్నారని రాయికల్ మజీ మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజి మహేందర్ బాబు తెలిపారు

# శకునాల గ్రామంలో అమీలియో హాస్పిటల్స్ 25వ ఉచిత వైద్య శిబిరం

### పాణ్యం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

### ఈ హరి గౌడ్, మురళి రెడ్డి గ్రామ పెద్దల సహకారం

**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 17(రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంశకునాల గ్రామంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో అమీలియో హాస్పిటల్స్ 125వ ఉచిత వైద్య శిబిరం అలాగేటీడీపీ నాయకులు, హరి గౌడ్ , మురళి రెడ్డి,ఆధ్వర్యంలో నిర్వహణ వైద్య సేవలో వందలాది మందికి ఉచిత వైద్య సేవలు,శకునాల గ్రామంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అమీలియో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం 125వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టీడీపీ సీనియర్ నాయకులు ఈ,హరి గౌడ్, మల్లేశ్వర్ రెడ్డి,ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో గుండె, క్యాన్సర్,



మధుమేహం (షుగర్), రక్తపోటు (బీపీ), కంటి, ఎముకలు, గర్భిణీ స్త్రీలు, హెర్నియా, చెవిముక్కుగొంతు (ఈఎన్‌టీ) తదితర సమస్యలకు సంబంధించిన నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు.
అలాగే 2డీ ఈకో, ఈసీజీ, ఆర్‌బీఎస్ (షుగర్), బీపీ పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకుని శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు టీడీపీ నాయకులు బోయ పుల్లయ్య, మంగళి తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు. పాణ్యంఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సహకారంతో ఈ మెడికల్ క్యాంప్ నిర్వహించడం చాలా సంతోషం అని శకునాల గ్రామ ప్రజలు అమీలియా హాస్పిటల్ యజమానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

# ప్రారంభం కాని పనులు రద్దు చేయాలి

### తాగునీటి సమస్య పరిష్కారానికే ప్రాధాన్యం -జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



**అనంతపురం జెడ్పీ, జూలై 17,( రిపబ్లిక్ న్యూస్):**
ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15వ ఆర్థిక సంఘం, జెడ్పీ జనరల్ ఫండ్ కింద గత మూడేళ్లలో మంజూరై ఇప్పటికీ ప్రారంభం కాని అభివృద్ధి పనులను రద్దు చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధికారులను ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం సీఈఓ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఇంజినీరింగ్ శాఖల సమీక్ష సమావేశంలో గిరిజమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖల అధికారులు హాజరయ్యారు. సబ్‌డివిజన్‌ల వారీగా జెడ్పీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని ఆమె సమీక్షించారు.ఈ సందర్భంగా ఇప్పటికీ ప్రారంభం కాని పనుల వివరాలను అడిగి తెలుసుకున్న గిరిజమ్మ, అలాంటి పనులను ఇకపై అమలు చేయకుండా రద్దు చేసే ప్రక్రియ చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఎక్కడెక్కడ తాగునీటి సమస్య తీవ్రంగా ఉందో గుర్తించి, వాటి పరిష్కారానికి అత్యవసర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యానికి తావు లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏపీఆర్ గురుకుల పాఠశాలలో

# ఆహార నాణ్యతపై ఎంపీడీవో తనిఖీ

### కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలన. నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు

### విద్యార్థులతో మాట్లాడిన ఎంపీడీవో నాగ అనసూయ



**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 17(రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని ఏపీఆర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతపై వచ్చిన వార్తల నేపథ్యంలో ఓర్వకల్లు ఎంపీడీవో నాగ అనసూయ శుక్రవారం ఆకస్మికంగా పాఠశాలను సందర్శించి తనిఖీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పరిశీలన చేపట్టినట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానం, విద్యార్థులకు అందిస్తున్న భోజనం, తాగునీటి సౌకర్యాలు, హాస్టల్ వసతులను ఎంపీడీవో క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న ఆహారం, ఇతర సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడం ప్రభుత్వ ప్రాధాన్యమని ఓర్వకల్లు ఎంపీడీవో నాగ అనసూయ పేర్కొన్నారు. ఆహార నాణ్యతలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఆమె స్పష్టం చేశారు.జిల్లా యంత్రాంగం విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, పాఠశాలల్లో తరచూ తనిఖీలు నిర్వహిస్తూ సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు చర్యలు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.



# ఓర్వకల్లులో ప్రధానోపాధ్యాయుల సమావేశం

### మెగా పేరెంట్స్ మీటింగ్ విజయవంతానికి దిశానిర్దేశం

**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 17(రిపబ్లిక్ న్యూస్)**
శుక్రవారం రోజు ఓర్వకల్లు మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు ప్రాథమిక,ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఓర్వకల్ నందు ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో MEO జి ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన జరుగు మెగా పేరెంట్స్ మీటింగ్ కు సంబంధించి నిర్వహించవలసిన కార్యక్రమాలు, LEAP APP ను పేరెంట్స్ మొబైల్ నందు డౌన్లోడ్ చేయించడం, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, MDM,SRKVM డిస్ట్రిబ్యూషన్ మరియు బయోమెట్రిక్ అథెంటికేషన్ మొదలగు వాటి గురించి తెలియజేయడం జరిగింది. ఈ సమావేశము నందు MEO రాంభూపాల్ రెడ్డి మరియు మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.



# పెండింగ్ లో ఉన్న10.500 కోట్ల రూపాయలు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదలకై పి డి ఎస్ యు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ధర్నా

**పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 17( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న10.500 కోట్ల రూపాయలు తక్షణమే విడుదల చేయాలని 23 వేల ప్రభుత్వ స్కూల్లో మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని స్థానిక ఆశ్చర్య డిగ్రీ కాలేజ్ నుండి దాదాపుగా 4000 మంది విద్యార్థులతో ఆర్డిఓ ఆఫీస్ వరకు భారీ ఎత్తున ర్యాలీ అనంతరం ధర్నా నిర్వహించి ఆర్డిఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది అనంతరం పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి ఎస్ శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు పెద్దపీట వేస్తామని చెప్పి విద్యను అభివృద్ధిలోకి ఇస్తామని చెప్పి పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఈ ముఖ్యమంత్రి విద్యను పూర్తిగా దూరం చేయాలన్న ఆలోచనలు పరిపాలన కొనసాగిస్తున్నారు అంతేకాకుండా పెండింగ్లో ఉన్న10.500 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లో రాక విద్యార్థులు ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులే స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ ఆధారపడి చదువుతారు వారిని విద్యకు దూరం చేయాలని చూడడం దుర్మార్గం ఏదైతే పాత పద్ధతిలో విద్యార్థులకు డబ్బులు ఇచ్చారు అదేవిధంగా





కొనసాగించాలని అంతేకాకుండా రాష్ట్రంలో 23 వేల ప్రభుత్వ పాఠశాల మూసివేస్తే ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది కనుక ప్రభుత్వ పాఠశాల మూషివేతను నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని సబ్జెక్టు సరిపడే టీచర్స్ను స్కావెంజర్ను భర్తీ చేయకుండా ఉన్న పాఠశాలలోనే ఎత్తివేస్తామనడం సిగ్గుచేటు ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలలో కల్పించి విద్యార్థులకు తగిన రీతిలో ఏర్పాటు చేయాలని అన్నారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సంసిద్ధమవుతామని హెచ్చరించారు ఈ



కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఇస్మాయిల్ .అనిల్. డివిజన్ కార్యదర్శి. గోపాల్ నాయకులు అనిరుద్. క్రాంతి కుమార్, పౌల్రాజ్. సంజన సునీల్, కరణ్, మిరాజ్ మల్లేష్, పవన్, ఈశ్వర్, వరలక్ష్మి, శిరీష, మహా శ్రీ, , తదితరులు పాల్గొన్నారు

# లింగమయ్య కాలనీలో జన సమూహాల మధ్య నీటి కుంపటి

## పట్టించుకోని అధికారులు







**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి జులై 17( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**అమీన్పూర్ మున్సిపల్ కార్పొరేషన్ లో లింగమయ్య కాలనీ మురికి కుంపల మారింది. వర్షాలు వస్తే మురికి నీరు అంతా తమ ఇళ్లలోకి వస్తుందని అక్కడి గ్రామస్తులు తెలియపరిచారు. ఇలా నీరు రావడం వల్ల , దోమలు , ఉండటంవల్ల చిన్నపిల్లలు, విష జ్వరాలకు గురవుతున్నారు,మున్సిపల్ అధికారులకు ఎంత చెప్పినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారి ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఇక్కడ ఉన్న రాజకీయ నాయకులు మాకు ఓటు వేయండి అభివృద్ధి చేసి చూపిస్తాం అని ఇక్కడి నాయకులు ఓట్లు వేసేదాకా మా ఇళ్ళ చుట్టూ తిరిగి ఇప్పుడు మాత్రం ఒక్కరు కూడా కనిపించడం లేదు. అంటే గెలవకముందు ఒక మాట గెలిచాక ఇంకో మాట మాట్లాడుతున్నారు. ఇలా ఉండగా మున్సిపల్ సిబ్బందికి తెలియచేస్తే చేస్తాం చూస్తాం అంటున్నారు తప్ప ఇండ్లలోకి ఎంత నీరు వచ్చిన మమ్మల్ని పట్టించుకోవడం లేదు అని ప్రజలు తెలియజేస్తున్నారు.

# జెడ్పీహెచ్ఎస్ నేరడిగుంట & మక్తగూడెం విద్యార్థులకు పాఠశాల బ్యాగుల పంపిణీ







**అందోల్ పతినిధి జూలై 17( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

విద్యార్థుల భవిష్యత్తే గ్రామాభివృద్ధికి బలమైన పునాది అనే లక్ష్యంతో నేడు జెడ్పీహెచ్ఎస్ నేరడిగుంట & మక్తగూడెం పాఠశాల విద్యార్థులకు పాఠశాల బ్యాగులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వొగ్గు సాయికిరణ్, ఉపసర్పంచ్ కొడండ ఈశ్వర్ గారు, వార్డు సభ్యులు, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ మాట్లాడుతూ, "నేటి విద్యార్థులే రేపటి భారతదేశానికి బంగారు భవిష్యత్తు. ప్రతి చిన్నారి ఆత్మవిశ్వాసంతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆర్థిక ఇబ్బందులు వారి చదువుకు ఎప్పటికీ అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాము. విద్యపై పెట్టే ప్రతి పెట్టుబడి సమాజ భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడే" అని పేర్కొన్నారు. విద్యార్థుల ముఖాల్లో కనిపించిన ఆనందం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ గ్రామపంచాయతీ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# నూతన భవన నిర్మాణాలకు స్థల పరిశీలన చేయాలి

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**



జిల్లాలోని నూతన మండలాలలో తహసిల్దార్ కార్యాలయానికి, సబ్ రిజిస్టర్ కార్యాలయాల నూతన భవన నిర్మాణానికి స్థలం సేకరణ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ నుంచి గూగుల్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. నూతన మండలాలైన హవేలీ ఘనపూర్ ,నిజాంపేట, చిలిపిచేడు మండలాలకు తహసిల్దార్ కార్యాలయ నిర్మాణానికి భూసేకరణ త్వరితగతిన చేపట్టాలన్నారు .మెదక్ ,నర్సాపూర్, రామాయంపేట డివిజన్ పరిధిలో రిజిస్టర్ కార్యాలయ భవన నిర్మాణం కోసం స్థల సేకరణను వేగవంతం చేసి , స్థల సేకరణ సంబంధిత ఫైళ్లను ఉన్నతాధికారులకు నివేదించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం,ఆర్డీవోలు, రమాదేవి, రామకృష్ణ బవయ్య,తహసిల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేట 14వ వార్డులో అండర్గ్రౌండ్ డ్రైనేజీ ఎప్పుడు?

## మురికి కాలువలతో ప్రజల తీవ్ర ఇబ్బందులు

**అందోల్ ప్రతినిధి**

**జులై 17 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

జోగిపేట పట్టణంలోని 14వ వార్డులో అండర్గ్రౌండ్ డ్రైనేజీ పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ప్రతి వార్డులో అండర్గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినప్పటికీ, ఆ హామీ ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం వార్డులోని మురికి కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. కాలువల్లో





మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు అధికంగా పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారాయి. చిన్నారులు, వృద్ధులు, మహిళలు అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలపై ఉన్న సిమెంట్ మూతలు కూడా పలు చోట్ల విరిగిపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కాలువలను శుభ్రపరచడంతో పాటు అండర్గ్రౌండ్ డ్రైనేజీ పనులను తక్షణమే ప్రారంభించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# నర్సాపూర్ మున్సిపాలిటీలో సార్ ప్రక్రియను పరిశీలించిన నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి

**నర్సాపూర్ నియోజకవర్గ ప్రతినిధి జూలై 17( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**





నర్సాపూర్ మున్సిపాలిటీలోని పలు వార్డులలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సార్ ప్రక్రియను నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి గారు ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచూసుకొని అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు ఈ ప్రత్యేక సవరణలో వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం హత్నూర మండలం మంగాపూర్ గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆవుల రాజిరెడ్డి గారు పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇంటి కల సాకారం అవుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మెగా పీటీఎం ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి

**జూలై 24న ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 4వ మెగా పీటీఎం నిర్వహణ**

**తల్లికి వందనం సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, జూలై 17 (రిపబ్లిక్ న్యూస్):**

24న నిర్వహించనున్న నాలుగో మెగా పేరెంట్ – టీచర్ మీటింగ్ (పీటీఎం)ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మెగా పీటీఎంపై సంబంధిత అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మాత్రమే మెగా పీటీఎంను నిర్వహించాలని, కార్యక్రమంలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థుల విద్యా ప్రగతి, ఆరోగ్యం, పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పిల్లల ద్వారా స్థానికంగా లభించే పర్యావరణహిత సామగ్రితో ఆహ్వాన పత్రికలు తయారు చేసి తల్లిదండ్రులకు అందించాలని సూచించారు. గతంలో ఎక్కువగా తల్లులే హాజరైన నేపథ్యంలో ఈసారి తండ్రులు కూడా తప్పనిసరిగా పాల్గొనేలా ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని, పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఇద్దరూ కలిసి హాజరయ్యేలా అవగాహన కల్పించాలని తెలిపారు. మెగా పీటీఎంపై అన్ని సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

**తల్లికి వందనం సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు**

'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన ఆధార్ అనుసంధానం, ఎన్పీసీఐ ఇన్యాక్టివేషన్, బ్యాంకు ఖాతా – ఫోన్ నంబర్ లింకేజీ, హౌస్హోల్డ్ మ్యాపింగ్ వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 76 ప్రత్యేక ఆధార్ కేంద్రాల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఎంఈఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో సుమారు 2,900 పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ నెల 21, 22 తేదీల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమయ్యే నేపథ్యంలో అర్హులందరికీ ఒకేసారి ప్రయోజనం అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.



**లీప్ యాప్ వినియోగం తప్పనిసరి**

ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలల పర్యవేక్షణ తదితర వివరాలు లీప్ యాప్ ఆధారంగానే సమీక్షించబడుతున్నందున యాప్ను సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మెగా పీటీఎం నాటికి ప్రతి తల్లిదండ్రి మొబైల్లో లీప్ యాప్ను డౌన్లోడ్ చేయించి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ యాప్ ద్వారా విద్యార్థుల హాజరు, మార్కులు, ఆరోగ్య వివరాలు, మధ్యాహ్న భోజన సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

**హెల్త్ కార్డులు, ప్రోగ్రెస్ కార్డులు సిద్ధం చేయాలి**

విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులతో పాటు హెల్త్ కార్డులను కూడా అందించాలని, ఇంకా పూర్తి కాని ఆరోగ్య పరీక్షలను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమన్వయం చేసి పూర్తి చేయించాలని కలెక్టర్ సూచించారు. ఈసారి మెగా పీటీఎంలో రంగవల్లుల పోటీలు, క్రీడా పోటీలు, పునాది అక్షరాస్యత–సంఖ్యాజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్)పై అవగాహన, ఐఎఫ్పీ ప్యానెళ్ల పనితీరు పరిశీలన, విద్యార్థుల కిట్ల పంపిణీ, 'డ్రగ్స్ వద్దు బ్రో' అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.

**పాఠశాల అభివృద్ధి, పరిశుభ్రతపై దృష్టి**

పాఠశాల అభివృద్ధి పనుల పురోగతిని ఫొటోలతో సహా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికల రూపంలో పంపించాలని, కొనసాగుతున్న మోడల్ పనులను అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం విడుదల చేసే ఏకరీతి మెనూనే అమలు చేయాలని, రాయలసీమ ప్రాంతీయ రుచులకు అనుగుణంగా రూపొందించిన మెనూను పాటించాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, వంటశాలలు, వరండాలను డీప్ క్లీనింగ్ చేసి ఈగలు, అపరిశుభ్రత లేకుండా చూడాలని ఆదేశించారు.

**గ్రీన్ పాస్పోర్ట్, డోనర్ యాప్పై ప్రత్యేక దృష్టి**

పాఠశాలల్లో నాటిన మొక్కలకు సంబంధించిన గ్రీన్ పాస్పోర్ట్ వివరాలను తప్పనిసరిగా అప్డేట్ చేయాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, దాతల సహకారం పెంచేందుకు డోనర్ యాప్ను విస్తృతంగా ప్రచారం చేయాలని, మౌలిక సదుపాయాలకు సంబంధించిన విరాళాల వివరాలను యాప్లో నమోదు చేయాలని తెలిపారు. జూలై 24న ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మెగా పీటీఎంలో తల్లిదండ్రులకు స్వాగతం, లీప్, డోనర్ యాప్ల కోసం హెల్ప్డెస్కులు, తరగతి గదుల్లో ఉపాధ్యాయులు–తల్లిదండ్రుల వ్యక్తిగత సమావేశాలు, విద్యార్థుల ప్రగతి, ప్రవర్తన, ఎఫ్ఎల్ఎన్ అంశాలపై చర్చలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం విద్యా సామగ్రి ప్రదర్శన, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, లీప్ యాప్ ప్రదర్శన, డోనర్ యాప్ నమోదు, ముఖ్య అతిథుల సందేశాలు, ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించి, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద భోజన వడ్డనతో కార్యక్రమాన్ని ముగించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మెగా పీటీఎంను విజయవంతంగా నిర్వహించి, విద్యార్థుల అభ్యాస నాణ్యతతో పాటు తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలి

**ప్రతి అర్జీపై క్షేత్రస్థాయిలో విచారణ తప్పనిసరి**

**'వన్ మంత్‌ఫోర్ విజిట్'లో వెలుగోడులో ప్రత్యేక గ్రీవెన్స్ వేదిక**

**వెలుగోడు అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రల పంపిణీ**





**నంద్యాల బ్యూరో, జూలై 17 (రిపబ్లిక్ న్యూస్):** ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని సానుకూల దృక్పథంతో పరిశీలించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. 'వన్ మంత్ - ఫోర్ విజిట్' కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌లు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు, సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీని పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యల కోసం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 'వన్ మంత్ - ఫోర్ విజిట్' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించదగినవైతే, మరికొన్ని చట్టపరమైన లేదా ఆర్థికపరమైన అంశాలతో ముడిపడి ఉంటాయని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా స్పందించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, అర్జీదారులతో స్వయంగా మాట్లాడిన అనంతరమే నివేదికలు సమర్పించాలని సూచించారు. కేవలం పైపైన పరిశీలించి సమస్య పరిష్కారమైందని నమోదు చేస్తే తీవ్రంగా పరిగణిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి ప్రధానంగా భూ సమస్యలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, నిలిచిపోయిన భవనాల పనులు పూర్తి చేయడం, గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం వంటి అభివృద్ధి పనులకు సంబంధించిన అర్జీలు అధికంగా వస్తున్నాయని తెలిపారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్



రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యలను గ్రామ స్థాయిలోనే గుర్తించి వేగంగా పరిష్కరించేందుకు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెలుగోడు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇప్పటికే నియోజకవర్గంలోని రెండు మండలాల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని, మిగిలిన మండలాల్లో కూడా వచ్చే వారం నుంచి ప్రతి శుక్రవారం ఈ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం వెలుగోడు మండల పరిధిలోని 20 అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం తయారు చేయడానికి అవసరమైన ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రలు (యుటెన్సిల్స్)ను జిల్లా కలెక్టర్, శ్రీశైలం ఎమ్మెల్యే సంయుక్తంగా పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పోషకాహారాన్ని పరిశుభ్రంగా, సురక్షితంగా తయారు చేసేలా అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించాలని సిబ్బందికి సూచించారు.

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు**

1) వెలుగోడు మండలం, అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన చింతకుంట రాముడు తనకు గతంలో ప్రభుత్వం నుండి 0.50 సెంట్ల వ్యవసాయ భూమి మంజూరు చేశారని, చుట్టుపక్కల ఉన్న భూములు ఆక్రమణకు గురవుతున్న సందర్భంగా రీసర్వే చేసి తన భూమిని తనకు ఇప్పించగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

2) వెలుగోడు మండలానికి చెందిన సయ్యద్ ఖలీల్ కు బోయరేవుల గ్రామంలో సర్వే నెం.265ఎలో 4.94 సెంట్ల భూమి చుక్కల భూమిగా నమోదు అయ్యిందని, సదరు భూమిని చుక్కల భూమి జాబితా నుండి తొలగించగలరని జిల్లా కలెక్టర్ కు అర్జీ అందజేశారు.

3) వెలుగోడు మండలానికి చెందిన వాడం శివకృష్ణ తనకు ఎలాంటి సొంత ఇల్లు లేదని, ఇంటి స్థలం మంజూరు చేయగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు, వెలుగోడు మండల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదవాలి

**ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదవాలి**

**బిలేకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ**

**విద్యార్థులతో ముఖాముఖి, మౌలిక వసతుల మెరుగుదలకు ఆదేశాలు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 17)**

విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సూచించారు. ఆస్పరి మండలం బిలేకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆమె విద్యాభివృద్ధి, బోధన, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, మౌలిక వసతులను పరిశీలించారు.

పదో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారి విద్యాభ్యాసం, సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అన్ని సౌకర్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని, పాఠశాల యూనిఫామ్‌లు మరో రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను స్వయంగా పరిశీలించిన ఆమె, భోజనం రుచిగా, నాణ్యతతో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యార్థులు పాఠ్యపుస్తకాలు అందుకున్నారా, ఉపాధ్యాయులు సమర్థవంతంగా బోధిస్తున్నారా, స్లిప్ టెస్టులు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారా, గణితంపై పట్టు సాధిస్తున్నారా వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పరీక్షను అవకాశంగా తీసుకుని అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలను విద్యార్థులు ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

మెగా పేరెంట్స్-డేకు తల్లిదండ్రులందరూ రావాలి

ఈ నెల 24న నిర్వహించనున్న మెగా పేరెంట్స్-డే కార్యక్రమానికి ప్రతి విద్యార్థి తన తల్లిదండ్రులను స్వయంగా ఆహ్వానించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అందించిన ఆహ్వాన పత్రికలను అందజేసి కార్యక్రమానికి తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. విద్యార్థుల విద్యా పురోగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

లీప్ యాప్ వినియోగంపై విద్యార్థులను ప్రశ్నించిన కలెక్టర్, తల్లిదండ్రులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పిల్లల హాజరు, చదువు, విద్యా పురోగతిని నిరంతరం పరిశీలించాలని సూచించారు. పెద్దలను గౌరవిస్తూ వారి మార్గదర్శకాలను పాటించాలని విద్యార్థులకు సూచించారు.

**సోషల్ మీడియాకు దూరంగా.. ఉన్నత విద్యే లక్ష్యం**

విద్యార్థులు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని, వేప, నేరేడు, గానుగ వంటి మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని, జంక్ ఫుడ్, డ్రగ్స్, మాదకద్రవ్యాలు వంటి చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.

ముఖ్యంగా బాలికలు చిన్న వయసులో వివాహం గురించి ఆలోచించకుండా ఉన్నత విద్యను లక్ష్యంగా పెట్టుకోవాలని పేర్కొన్నారు. ఇంట్లో వివాహ ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కలెక్టర్, వైద్యుడు, ఇంజినీర్, పోలీస్ అధికారి, ఉపాధ్యాయుడు వంటి ఉన్నత లక్ష్యాలను



నిర్దేశించుకుని కష్టపడి చదవాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు.

**పాఠశాలకు నాలుగు అదనపు గదులు సమస్యల పరిష్కారానికి చర్యలు**

పాఠశాలకు అవసరమైన నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి వెంటనే అంచనాలు, ప్రణాళికలు సిద్ధం చేసి పంపాలని హెడ్మాస్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు. అలాగే తాగునీరు, కాంపౌండ్ వాల్, విద్యుత్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు జిల్లా అధికారి భాస్కర్ నాయుడు, పత్తికొండ ఆర్డీవో చిన్న ఓబులేసు, తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి, ఎంపీడీవో గీతావాణి, ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ తిరుమలరావు, హెడ్మాస్టర్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ముఖ్య విజ్ఞప్తి పెట్టుబడి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**అధిక లాభాలు వస్తాయనే దురాశకులోనై సైబర్ నేరాల బారిన పడవద్దు**

**జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**



**నంద్యాల క్రైం, జూలై 17, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా ప్రజలకు తెలియజేయునది ఏమనగా, ఇటీవల అధిక లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్, ఫోన్ కాల్స్, నకిలీ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌ల ద్వారా పెట్టుబడి పేరుతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు జిల్లా సైబర్ క్రైమ్ పోలీసుల ద్వారా, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పోలీసు అధికారులు తమ పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో, పట్టణాలలో విస్తృతంగా అవగాహన సదస్సులు చేపట్టడం జరుగుతుంది. కానీ కొంతమంది వ్యక్తులు అత్యాశకు గురై సైబర్ నేరగాళ్ల చేతిలో పడి మోసపోతున్నారు. కావున క్రింది జాగ్రత్తలు పాటించి సైబర్ నేరాలకు గురి కావద్దని తెలియజేయడం జరుగుతుంది.

**మీ భద్రత కోసం ఈ సూచనలు పాటించండి**

తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే పెట్టుబడి పథకాలను నమ్మవద్దు. తెలియని వ్యక్తులు లేదా సంస్థలు పంపిన లింక్‌లను క్లిక్ చేయవద్దు. ధృవీకరణ లేని యాప్‌లు లేదా వెబ్‌సైట్లలో డబ్బు పెట్టుబడి పెట్టవద్దు. మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటిపి, యూపీఐ, పిన్ లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ చెప్పవద్దు. పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ చట్టబద్ధమైనదో కాదో తప్పనిసరిగా నిర్ధారించుకోండి. జిల్లాలో ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు కాల్ చేయండి.

లేదా ప్రభుత్వ సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయండి.సమీప పోలీస్ స్టేషన్‌ను గాని జిల్లా పోలీస్ కేంద్రంలో గల సైబర్ కార్యాలయాన్ని గాని సంప్రదించండి.

**గుర్తుంచుకోండి**

"అధిక లాభాల ఆశతో తొందరపడి తీసుకునే నిర్ణయం, జీవితకాల పొదుపును కోల్పోయే ప్రమాదానికి దారితీస్తుంది."ప్రజల భద్రతే మా బాధ్యత అప్రమత్తతే మీ రక్షణ.

## "వన్ మంత్ ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా వెలుగోడులో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"

**ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలి -జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**





**నంద్యాల క్రైం, జూలై 17, (రిపబ్లిక్ న్యూస్):** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు "వన్ మంత్ ఫోర్ విజిట్" కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ కార్యక్రమం ద్వారా అధికారులు ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించేందుకు ఇది చక్కని అవకాశం అని జిల్లా ఎస్పీ తెలిపారు. శుక్రవారం శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, మరికొందరు జిల్లా అధికారులు పాల్గొన్నారు. అధికారులు వారి వారి శాఖల వారీగా ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తారని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖకు సంబంధించిన ఫిర్యాదులను చట్టపరిధిలో చట్టప్రకారం అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తామని భరోసా కల్పిస్తూ ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ఆగస్టు 1 నాటికి "వన్ మంత్ - ఫోర్ విజిట్" అర్జీల పరిష్కారం పూర్తి చేయాలి

**రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ తగ్గించాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జూలై 17 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్దేశిత గడువులోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆళ్లగడ్డ, శ్రీశైలం నియోజకవర్గాల మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండల స్థాయిలోనే ప్రజా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి నెల నాలుగు శుక్రవారాలు ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని సకాలంలో పరిష్కరించడం అధికారుల ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. ఆళ్లగడ్డ మండలంలో ఇప్పటివరకు 838 అర్జీలు స్వీకరించగా 680 పరిష్కరించి 158 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. చాగలమర్రి మండలంలో 351 అర్జీలకు గాను 209 పరిష్కరించి 142 పెండింగ్‌లో ఉండగా, రుద్రవరం మండలంలో 326 అర్జీలకు గాను 181 పరిష్కరించి 145 పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. ఈ మూడు మండలాల్లో ప్రధానంగా రెవెన్యూ సంబంధిత దరఖాస్తులే అధికంగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, వాటిని ఆగస్టు 1వ తేదీలోపు పూర్తిగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు, మహానంది మండలాల్లో పెండింగ్‌లో ఉన్న అర్జీలను కూడా ఆగస్టు 1వ తేదీలోపు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. మిగిలిన మండలాల్లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వచ్చే శుక్రవారం నాటికి పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పెండింగ్‌కు గల కారణాలపై కలెక్టర్ అధికారులను ప్రశ్నించగా, ఆర్ఓఆర్ సంబంధిత నోటీసులు జారీ చేసినట్లు, 22-ఏ ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపిస్తున్నట్లు సంబంధిత అధికారులు కలెక్టర్ కు నివేదించారు. శుక్రవారం వెలుగోడులో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో 550 కొత్త అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్, సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com